ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 1 జూలై 2025





షమీమ్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న మురళీబాబు

జిల్లా ప్రజా రవాణా అధికారిణిగా షమీమ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణా అధికారిణిగా ఎస్‌కె షమీమ్ నగరంలోని ఆర్టీసీ ప్రజా రవాణా శాఖ జిల్లా కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె 2010లో ప్రకాశం జిల్లా పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. అక్కడ నుంచి నెల్లూరు-2 డిపో డీఎంగా బదిలీ అయ్యారు. జిల్లాలోనే పదోన్నతులు పొందుతూ నెల్లూరు రీజియన్ సీటీఈఎమ్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.జిల్లా ప్రజారవాణాధికారి మురళీబాబు రిటైర్డ్ కావడంతో ఆయన స్థానంలో షమీమ్‌ను నియమిస్తూ ఆర్టీసీ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం అందించే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు జులై 13వ తేదీ లోపు ఆన్‌లైన్ పోర్టల్ nationalawardstoteachers.education.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పోర్టల్‌ను పరిశీలించాలని తెలిపారు.

నేడు దిశ సమావేశం

నెల్లూరు(జడ్పీ), జూన్30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని జిల్లాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న 68 పథకాలకు సంబంధించి ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సభ్యులు, జిల్లాస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.



సోమశిలలో నేటి నుంచి చేపల వేట నిషేధం

అనంతసాగరం జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో మంగళవారం నుంచి మూడు నెలల పాటు చేపల వేట నిషేధించారు. ఈ మూడు మాసాలు చేప గుడ్డుదశలో ఉంటుంది. దీంతో చేపల ఉత్పత్తి పెంచేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. అయితే కొందరు వ్యాపారులు, జాలర్లు బయట వారిని పిలిపించి అక్రమ వేటకు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ప్రాజెక్టు లోతట్టులోని జనసంచారం లేని ప్రాంతాల నుంచి చేపలవేట సాగించి వెనుకవైపు కడప జిల్లా గోపవరం మండలం వద్ద అటవీ ప్రాంతం నుంచి గుట్టుగా తరలించేలా కార్యాచరణ చేసినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే రాబోవు రోజుల్లో చేపల వేటపై జీవనం సాగించే మత్స్యకారుల జీవనప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. నిషేధాన్ని పక్కాగా అమలు పరచి కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. కాగా, ఇటీవల మత్స్యశాఖ అధికారులు సోమశిలలో జాలర్లతో సమావేశమై నిషేధ సమయంలో చేపలవేట సాగించవద్దని గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు వ్యాపారులను పిలిపించి నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు ఉంటాయని సూచించారు.

● డ్యాంలో నీటి నిల్వ

సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 227 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నీటినిల్వ 33.128 టీఎంసీలుగా నమోదై ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 850, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలు

నెల్లూరు(క్రైం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. ఎస్పీ కృష్ణకాంత్ బదిలీల పక్రియను పర్యవేక్షించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి, నిబంధనలు అనుసరించి ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలు నిర్వహిస్తున్నామన్నారు.

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్ల పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ కోర్సుల్లో మార్పులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, మధ్యాహ్నభోజనం అమలు, కళాశాలలు తెరిచే నాటికి పుస్తకాలు అందిస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల వైఫల్యం కారణంగా అడ్మిషన్ల సంఖ్య పూర్తిగా పడిపోయింది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది 2,185 మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులపై ప్రత్యేక కథనం

● ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు అంతంతే! ● టెన్త్‌లో ఉత్తీర్ణత 23,633 మంది, కళాశాలల్లో చేరిక 2,185 మందే..
● ప్రభుత్వం అందిస్తున్న వసతులపై కొరవడిన ప్రచారం ● అవగాహన లేక విద్యార్థుల 'ప్రైవేటు' బాట ● అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

అన్నీ ఉన్నా.. ప్రవేశంలో పతనం!

నెల్లూరు (విద్య), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 23, ఎయిడెడ్ 2 కళాశాలలు కలిపి 25 కాలేజీలు ఉన్నాయి. ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి కొత్త విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. నీట్, జేఈఈ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా సిలబస్‌లో మార్పులు చేసింది. జూ.ఇంటర్ సబ్జెక్టులలో కొత్త సిలబస్‌ను రూపొందించారు. ప్రథమ, ద్వితీయ భాషలతోపాటు ప్రస్తుతం ఉన్న 4 సబ్జెక్టులు సైన్స్, 5 సబ్జెక్టుల ఆర్ట్స్ విభాగాల వ్యవస్థను ప్రక్షాళన చేసి నూతన ఎంబైపీసీ కాంబినేషన్‌ను ప్రవేశపెట్టారు. అలాగే ప్రథమ భాషగా ఇంగ్లీష్‌ను అందరికీ వర్తింపచేస్తుండగా, ద్వితీయభాష కోసం ప్రస్తుతం ఉన్న పది భాషల స్థానంలో అదనంగా సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల్లో మరో 14 సబ్జెక్టుల ను ప్రతిపాదిస్తూ విద్యార్థికి ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే గ్రూపు సబ్జెక్టుల విభాగానికి వస్తే ఎంపీసీ గ్రూపు వి ద్యార్థులు అదనంగా బయాలజీని, బైపీసీ వారు అదనంగా మ్యాథ్స్ ను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. దీనిద్వారా ఎంబైపీసీ చదువుకుని జేఈఈ, నీట్ పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నారు. అలాగే ఒకేషనల్‌లో (వృత్తి విద్య) పలు కోర్సులు నిర్వహిస్తున్నారు. అయితే వీటిపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అడ్మిషన్లను పెంచడం లాంటి చర్యలను ఇంటర్ బోర్డు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.



● వందల్లోనే అడ్మిషన్లు

జిల్లాలో ఈ ఏడాది 23,633 మంది టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించారు. అయితే, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. జిల్లాలో 23 ప్రభుత్వ, 2 ఎయిడెడ్ కళాశాలలు ఉండగా వీటిలో జనరల్ కోర్సులు అన్ని కోర్సులు కలిపి ఏడు వేలకుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే గత విద్యా సంవత్సరం 3,500 మంది అడ్మిషన్లు జరగగా ఈ ఏడాది మరీ దారుణంగా 2,185 మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా ఉంటుందని భావించినా అతి స్వల్పంగా చేరడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇంటర్‌బోర్డులో పనిచేసే అధికారులు, సిబ్బంది అందరూ తమ స్వలాభాల కోసమే పనిచేస్తున్నారని, వేతనాలు, అలవెన్సులు మాత్రం లక్షల్లో తీసుకుంటూ అడ్మిషన్లను, విద్యార్థుల సంక్షేమా న్ని మాత్రం మరిచిపోతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నా రు. నగరంలోని డీకే బాలికల జూనియర్ కళాశాలలో 621 మంది విద్యార్థినులు, కేఏసీ కళాశాలలో 250 మంది, ఆత్మకూరులో 134, కందుకూరులో 131, కోవూరులో 109, ఉదయగిరిలో వందమంది అడ్మిషన్లు మినహా ఏ ఒక్క కళాశాలలోనూ 50కు మించి అడ్మిషన్లు లేకపోవడం, అతితక్కువగా వెంకటాచలంలో 45 మంది, ఇనమడుగులో 20 మంది అడ్మిషన్లు జరిగాయి.

● రేషనలైజేషన్ ఎఫెక్ట్

కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గడం, విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు తరలివెళ్లడం వంటి ఘటనలతో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో 11 పోస్టులను రేషనలైజేషన్ కింద తీసేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9 పోస్టులు, విడవలూరు కళాశాలలో 2 పోస్టులు తొలగించారు. కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం చుట్టూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇవ్వడం, ప్రైవేట్, కార్పొరేట్‌లను ప్రోత్సహించడంతో విద్యార్థులంతా వీటికి తరలి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వ కళాశాలకు సుదూరంలో మాత్రమే అనుమతులివ్వాల్సిన బోర్డు అధికారులు కళాశాల పక్కనే ఎలా అనుమతులిస్తారని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ కళాశాలలకు అధికంగా అనుమతులు ఇవ్వడం కూడా ప్రభుత్వ ఇంటర్ ప్రవేశాలపై ప్రభావం చూపిందన్న ఆరోపణలున్నాయి. ఇంటర్‌బోర్డుకు సంబంధించి ఆర్‌ఐఓ కళాశాలల అనుమతులు, వసతుల కల్పన, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహణ తదితర అంశాలను పరిశీలిస్తారు. అలాగే డీవీఈఓ అడ్మిషన్ల ప్రక్రియ, కొత్త భవనాలు, తరగతిగదుల నిర్మాణాలు, ఇతర అంశాలను పరిశీలిస్తారు. అయితే ఆర్‌ఐఓ మాత్రం జిల్లాలో ఉంటుండగా, డీవీఈఓ మాత్రం జిల్లాకు నియమితులైనా రాష్ట్ర పరీక్షల విభాగం పరిశీలకులుగా కూడా పని చేస్తుండడంతో ఆయన నెలకో సారి మాత్రమే అందుబాటులో ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి జూనియర్ ఇంటర్ కళాశాలల మనుగడను కాపాడాలని, రెండో విడతలో అయినా అడ్మిషన్లు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై, అనుమతులిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒక్కడే!

నెల్లూరు (క్రైం) (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఎస్పీ పీజీఆర్ఎస్‌కు జనం తరలివచ్చారు. వారంతా ఉదయం 9 గంటలకే చేరుకున్నారు. గంటలు గడుస్తున్నా అధికారులు రాలేదు. చాలాసేపు తర్వాత మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుబ్బారావు వచ్చి ఫిర్యాదులు స్వీకరించడం ప్రారంభించారు. చివర్లో నగర డీఎస్పీ సింధుప్రియ వచ్చి కొన్ని ఫిర్యాదులను స్వీకరించారు.



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న మహిళా స్టేషన్ సీఐ

పుట్టింటికి తరలిన కలిగిరమ్మ

మూడు గ్రామాల గ్రామదేవత కలిగిరమ్మ తిరుణాళ్ల రెండో రోజు ఆలయంలో వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారు మేళతాళాల మధ్య, ముద్రగడ పావనం, వీరతాళ్లు, ఆవు, ఎద్దు వాహనాలు వెంటరాగా అమ్మవారు పుట్టినిల్లైన పాపనముసిలిపాలెం గ్రామోత్సవానికి తరలి వెళ్లారు. గ్రామోత్సవం అనంతరం తిరిగి మంగళవారం ఉదయానికి అమ్మవారు ఆలయానికి చేరుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)



కలిగిరిలో ఊరేగింపు మధ్య పుట్టినింటికి తరలివెళ్తున్న అమ్మవారు

ఇరిగేషన్ అధికారుల మెడకు 'సర్వేపల్లి' కేసు

● ముగ్గురిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఆదేశం

నెల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో చేసిన పాపాలు ఇరిగేషన్ అధికారులను కూడా వెంటాడుతున్నాయి. నాడు అధికార దర్పంతో వైసీపీ నాయకులు విచ్చలవిడి దోపిడీకి పాల్పడగా, వారిని అడ్డుకోవడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమయ్యారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో జరిగిన గ్రావెల్ దోపిడీనే ఇందుకు నిదర్శనం. ఏకంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరుతో ఫోర్జరీ సంతకాలతో గ్రావెల్ తవ్వకాలకు దరఖాస్తు చేసుకోగా ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇచ్చేశారు. ఇలా రూ.కోట్ల మట్టి, గ్రావెల్‌ను కొల్లగొట్టారు. ఈ అక్రమ వ్యవహారంపై ఇటీవల ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది. నాడు వెంకటాచలంలో నమోదైన కేసును బాపట్ల డీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటైన సిట్‌కు బదిలీ చేశారు. ఈ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆయన అనుచరుడు నిరంజన్‌రెడ్డిలతో మరికొంత మంది నిందితులుగా ఉన్నారు. వీరిద్దరినీ ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం దర్యాప్తు వేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే శాఖాపరమైన చర్యలకు ఇరిగేషన్ శాఖ పూనుకుంది. అప్పట్లో పనిచేసిన అధికారులను బాధ్యులను చేస్తూ చర్యలకు ఉపక్రమించింది. సర్వేపల్లి రిజర్వాయర్‌లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగిందని వాస్తవమని తేల్చిన ఈఎన్‌సీ, ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో ప్రభుత్వానికి రెండు నివేదికలు అందజేశారు. ఆ నివేదికల ఆధారంగా అప్పటి సెంట్రల్ డివిజన్ ఈఈ కృష్ణమోహన్, నెల్లూరు డీఈఈ పెంచలయ్య, బ్రహ్మదేవి సెక్షన్ ఏఈ ప్రసాద్‌లపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల క్రమశిక్షణ నిబంధనల ప్రకారం ఈ ముగ్గురు అధికారులకు మేజర్ పెనాల్టీ విధించే విధంగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేజర్ పెనాల్టీ ఏ స్థాయిలో ఉంటుందన్నది తెలియాల్సి ఉంది. ఈ వ్యవహారం ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఎలక్ట్రిక్ బస్సులు రయ్.. రయ్!

● నెల్లూరు 2వ డిపోకు 100 కేటాయింపు ● 12 మీటర్ల పొడవైనవి 64, 9 మీటర్లవి 36

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీలో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు రయ్.. రయ్‌మంటూ రోడ్లపై తిరగనున్నాయి. ఇప్పటికే నెల్లూరు-తిరుపతి మధ్య నడుస్తున్న బస్సులకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో నెల్లూరు రీజియన్ నెల్లూరు రెండవ డిపోకు కేంద్ర ప్రభుత్వం 100 ఎలక్ట్రికల్ హాయిర్ బస్సులను కేటాయించింది. ఈ బస్సులు అతి త్వరలోనే రీజియన్‌కు చేరనున్నాయి.



● 12 మీటర్ల పొడవైన బస్సులు

నెల్లూరు రీజియన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బస్సుల్లో 12 మీటర్ల పొడవైన బస్సులు 64, 9 మీటర్ల చిన్న బస్సులు 36 ఉన్నాయి. ప్రస్తుతం నెల్లూరు-తిరుపతి మధ్య తిరుగుతున్న ఎలక్ట్రికల్ బస్సులు 9 మీటర్ల పొడవు ఉన్నాయి. కేంద్రం నుంచి రానున్న 12 మీటర్ల పొడవైన బస్సులను ఆర్టీసీ అధికారులు చెన్నై, విజయవాడ, తిరుపతి నగరాలకు నడిపేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

● చార్జింగ్ పాయింట్ల పరిశీలన

నెల్లూరు రెండవ డిపో గ్యారేజ్‌లో ఇప్పటికే తిరుపతి డిపోకు చెందిన విద్యుత్ బస్సుల కోసం చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి ఉన్నారు. కొత్తగా వచ్చే ఎలక్ట్రికల్ బస్సుల కోసం రెండవ డిపో గ్యారేజ్‌లోనే చార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారుల గ్యారేజీలో ఎక్కడ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలి, ఎంత విద్యుత్ వాటికి అందించాలి అన్న అంశాలపై పరిశీలించారు. ఈ క్రమంలో కొద్ది రోజుల్లోనే చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు పూర్తి కానుంది. ఇక బస్సులు వచ్చిన వెంటనే రోడ్లపై ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు పరుగులు తీయనున్నాయి.

పచ్చని కాపురంలో అనుమానం చిచ్చు!

● మద్యం మత్తులో కత్తితో వీరంగం ● దుత్తలూరు మండలంలో దారుణం
● తొలుత భార్యపై దాడి ● అడ్డొచ్చిన అత్తామామలపై కత్తివేటు.. అక్కడికక్కడే మృతి
● భార్యకూ తీవ్రగాయాలు ● పరారీలో నిందితుడు

అనుమానం పెనుభూతమైంది. మద్యానికి బానిసను చేసింది. పచ్చని సంసారంలో చిచ్చుపెట్టి ఇద్దరి మృతికి కారణమైంది. నిండునూరేళ్లు తోడి నీడగా ఉంటానన్న భర్తే ఆ కుటుంబం పాలిట యమకింకరుడిగా మారాడు. మద్యం మత్తులో భార్యపై, అడ్డొచ్చిన అత్తామామలపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో వృద్ధ దంపతులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కొనఊపిరితో ఇల్లాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దుత్తలూరు మండలం కమ్మవారిపాలెం గ్రామ సమీపంలోని ఏసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.



మృతులు జయమ్మ, కల్లయ్య (ఫైల్)

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆనం చెంచుసుబ్బారెడ్డి (ఏసీ) కాలనీకి చెందిన ఏలూరి వెంగయ్యకు వెంకాయమ్మతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి శ్రావ్య, మనోహర్, శ్రీవల్లి అనే ముగ్గురు సంతానం. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ పిల్లల్ని చదివించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గత కొన్నినెలలుగా వెంగయ్య తన భార్యపై అనుమానం వ్యక్తం చేస్తూ మద్యానికి బానిసై తరచూ వివాదానికి దిగేవాడు. ఆదివారం రాత్రి వెంగయ్య పూటుగా మద్యం సేవించి అత్తామామల ఇంట్లో ఉన్న వెంకాయమ్మతో వివాదానికి దిగాడు. అడ్డొచ్చిన అత్తామామలు చలంచర్ల జయమ్మ(59), కల్లయ్యల(64)లపై విచక్షణారహితంగా దాడి చేయడంతో వారు అక్కడికక్కడే మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.

● మద్యం మత్తులో అంతమొందించి

ఆదివారం వెంకాయమ్మ కాలనీవాసులతో కలిసి వింజమూరు మండలం గుండెమడగల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లింది. పని ముగించుకుని సాయంత్రం ఇంటికొచ్చిన భార్యతో రోజులాగే వెంగయ్య కోపోద్రిక్తుడై వివాదానికి దిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దుత్తలూరు సెంటర్‌కు వెళ్లిన అతను పూటుగా మద్యం సేవించి ఇంటికొచ్చాడు. ఇంట్లో వెంకాయమ్మ లేకపోవడంతో మచ్చుకత్తి తీసుకుని తన అత్తామామల ఇంటికెళ్లి వివాదానికి దిగాడు. అడ్డొచ్చిన అత్తమామలను దీనంతటికి మీరే కారణమని వారిపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు.



దీంతో వారు అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయారు. భార్యను సైతం కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. ఆమె కేకలు విన్న కాలనీవాసులు అక్కడికి చేరుకోవడంతో వెంగయ్య కత్తితో పరారయ్యాడు.

● దిక్కుతోచని స్థితిలో పిల్లలు

వెంకాయమ్మ పిల్లలు శ్రావ్య, మనోహర్, శ్రీవల్లి స్థానిక పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. తండ్రి చేసిన వీరంగంతో అక్కున చేర్చుకునే అవ్వాతాతలు దూరమయ్యారు. తల్లి తీవ్ర గాయాలపాలై వైద్యశాలలో ఉండటం, తండ్రి జైలుకెళ్లనుండటంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. బిక్కమొహం వేసుకుని ఉన్న ఆ పిల్లల్ని చూసి కాలనీవాసుల గుండె తరుక్కుపోయింది.



హత్యలు జరిగింది ఈ ఇంట్లోనే.. పక్కనే కల్లయ్య మృతదేహం

● నిందితుడి కోసం పోలీసుల గాలింపు

సమాచారం అందుకున్న వెంటనే ఉదయగిరి సీఐ వెంకటరావు, దుత్తలూరు, వరికుంటపాడు ఎస్ఐలు ఆదిలక్ష్మి, రఘునాథ్‌లు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. కాలనీ వాసుల నుంచి వివరాలు రాబట్టారు. రెవెన్యూ అధికారులతో కలిసి పంచనామా నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. మృతదేహాలను అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. నిందితుడి ఆచూకీ కోసం లుకవుట్ నోటీసులు సైతం జారీ చేశారు.

రీసర్వే సమస్యలపై అర్జీలు

మనుబోలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సమస్యలు పరిష్కరించాలని రైతులు సోమవారం తహసీల్దార్‌కు అర్జీలు అందచేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావినతుల కార్యక్రమాన్ని తహసీల్దార్ రమాదేవి నిర్వహించారు. రైతులు రీ సర్వే భూ సమస్యలు ఏకరువుపెట్టారు. వీఆర్వో, ఆర్ఐలతో విచారణ చేయించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9230
వెండి కిలో ధర	రూ. 108900
వెండి ఒక గ్రాము	రూ. 111.90

న్యూస్ బాక్స్

నేడు డాక్టర్స్ డే వేడుకలు

కోవూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మారుతీ నాగార్జున తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కోవూరు, ఇనమడుగు ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేసే వైద్యులకు సన్మానం చేయనున్నట్లు వివరించారు. కరోనా సమయంలో వైద్యసిబ్బంది చేసిన సేవ అద్వితీయమన్నారు. గత మూడేళ్లుగా డాక్టర్స్ డేను తమ ట్రస్టు ఘనంగా నిర్వహిస్తోందన్నారు. వైద్యుల సేవలకు గుర్తింపుగా సన్మానించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమకు ఎంతో ప్రోత్సాహం కలిగిస్తున్నారని చెప్పారు.

ఎరువులను అధిక మోతాదులో వేయొద్దు

విడవలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎరువులను ఇష్టానుసారంగా వాడరాదని వ్యవసాయాధికారి లక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని పార్లపల్లి, చౌకిచర్ల గ్రామాల్లో సోమవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎరువుల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఎరువులను మోతాదుకి మించి వాడటం వలన దిగుబడులు తగ్గుతాయన్నారు. అంతేకాకుండా భూమిలో ఖనిజ లవణాలు తగ్గిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతోనే నియోజకవర్గ అభివృద్ధి

కొడవలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లునాయుడు అన్నారు. కొడవలూరు గిరిజన కాలనీలో గిరిజనుల ఇళ్లకు మట్టి తోలడాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. 14 ఇళ్లకు ఎమ్మెల్యే సహకారంతో మట్టితోలే కార్యక్రమం చేపట్టామని, ఈ ఇళ్లకు ఉచిత విద్యుత్ మీటర్లు అందించే విషయమై ఎమ్మెల్యే దృష్టికి, శ్రీహరిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేస్తామని తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత ఎమ్మెల్యే కాలనీని సందర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ముక్తార్ బాషా, కొడవలూరు తెలుగుదేశం పార్టీ నాయకులు జిలానీబాషా, కోవూరు వెంకి, నక్కా రమణయ్య, గుండాలమ్మపాలెం పల్లం రెడ్డి సురేష్, వైవంశీరెడ్డి, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణం తనిఖీ

కొడవలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌతమినగర్ రేషన్ దుకాణాన్ని తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు సరుకులు అందజేయాలని సూచించారు. ఆమె వెంట రెవెన్యూ అధికారులు ఉన్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

రాపూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దెలమడుగులో ఉన్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయాలు నిర్మించి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం వార్షిక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం అభిషేకాలు, అనంతరం శ్రీదేవి భూదేవి సమేత మహావిష్ణువు శాంతి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం క్షేత్రోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

కండలేరు నీటిమట్టం 33.276 టీఎంసీలు

రాపూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 33.276 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 24800 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుంచి 70 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 20 క్యూసెక్కులు మొత్తం 2590 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో అవుతుందని కండలేరు ఏఈ తెలిపారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు

తోటపల్లి గూడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతోపు గ్రామానికి చెందిన రౌడీషీటర్ లేబూరు బాలాజీ గతంలో జరిగిన ఎన్నికల్లో ఉన్న పాత గొడవలను దృష్టిలో ఉంచుకుని ఆదివారం అదే గ్రామానికి చెందిన ఎండ్లూరి నరేంద్రపై స్నేహితులతో కలిసి దాడి చేశారు. చింతోపు గ్రామంలోని తేజు లేఅవుట్‌లో నరేంద్ర క్రికెట్ చూస్తుండగా బాలాజీ, అతని స్నేహితులు వెళ్లి కత్తులతో, బీరు బాటిళ్లతో దాడిచేశారు. క్రికెట్ ఆడుతున్న వారు వచ్చి కాపాడినట్లు నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరేంద్రబాబు తెలిపారు. నిందితులను సోమవారం ఉదయం టీపీగూడూరు మండలం నరుకూరు సమీపంలోని కౌస్తుభం ఎస్టేట్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ అధికారులకు సమస్యలు పట్టవా ?

● మండల సమావేశంలో నిలదీసిన ప్రజాప్రతినిధులు

విడవలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖాధికా రులకు ప్రజలు, రైతుల సమస్యలు పట్టవా అని ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఏకుల శేషమ్మ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు విద్యుత్‌శాఖాధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలగానిపాడు గ్రామంలో 24 గంటలు విద్యుత్ ఇవ్వడానికి స్తంభాలు నాటారే తప్ప ఇంతవరకు పనులు ముందుకు సాగలేదన్నారు. దీనివలన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు, మండలంలో సుమారు 4 పంచాయతీలకు లైన్‌మెన్లు లేరని, కరెంట్ పోతే ఎవరికి చెప్పుకోవాలని వారు ప్రశ్నించారు. విద్యుత్ లైన్లు ఇళ్లపైన ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఊటుకూరు ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీడీవో నగేష్ కుమారి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, తహసీల్దారు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, నీటి సంఘం అధ్యక్షుడు ఆవుల రవిచంద్ర పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ మోహన్

ప్రధానోపాధ్యాయుడికి వీడ్కోలు సన్మానం

కోవూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన పాటూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గణపర్తి వెంకటేశ్వర్లు నాయుడును సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వపు విద్యార్థులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో చెంచులక్ష్మమ్మ మాట్లాడుతూ వెంకటేశ్వర్లునాయుడు విద్యార్థుల ఉన్నతికి ఎంతో సేవ చేసి ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలిచారన్నారు. ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకుని పని చేయాలన్నారు. సన్మానసభలో సర్పంచు శ్రీదేవి, ఎంపీటీసీ విజయసేనారెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జుల్ఫీకర్ ఆలీ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

దళితులకు శ్మశానం ఏర్పాటు

విడవలూరు, జూన్ 30(ఆంధ్ర జ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమి రెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో విడవ లూరులో దళితులకు శ్మశానం ఏర్పాటు చేసినట్లు ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి తెలి పారు. నూతనంగా కేటాయించిన శ్మశాన స్థలంలో పనులకు సోమవారం ఆయన భూమి పూజ చేశా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత కాలనీలో ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని పూడ్చేందుకు ఇబ్బం దులు తలెత్తేవన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆమె శ్మశా నానికి 73 సెంట్లు భూమి కేటాయింపు చేయిం చారన్నారు. దీంతో ఏన్నో ఏళ్లుగా దళితులు పడుతున్న ఇబ్బందులకు తెరపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐ టీపీడీ రాష్ట్ర కార్యదర్శి సత్య వోలు సత్యంరెడ్డి, దళిత సంఘాల నేతలు పల్లం శేషమ్మ, జడ్డా స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహాయ కార్యదర్శిగా డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సహాయ కార్యదర్శి(రెవెన్యూ శాఖ)గా నెల్లూరు డీఆర్వో జే. ఉదయభాస్కర్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. నెల్లూరుకు రెగ్యులర్ డీఆర్వో నియమితలయ్యే వరకు ఎఫ్ఏసీ డీఆర్వోని నియమించాలని ప్రభుతం కలెక్టర్‌ను ఆదేశించింది.

టీడీపీ నాయకులకు సత్కారం

పొదలకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు మండల టీడీపీ అధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తలచీరు మస్తాన్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి పల్లారపు కృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడును జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది సోమవారం పార్టీ కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో నరసింహారావు ఆధ్వర్యంలో ఉపాధిహామీ సిబ్బంది, మండలంలోని అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు వారికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరసింహారావు మాట్లాడుతూ మండల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలను అందించాలని నాయకులను కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు పని కల్పించడంతోపాటు పొదలకూరు మండల సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాయకత్వంలో మండల అధికారులతో తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



టీడీపీ నాయకులను సత్కరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శ

మనుబోలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. కాగితాలపూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వెడిచెర్ల వెంకట రమణారెడ్డి గుండె సంబంధిత వ్యాధితో నెల్లూరులో చికిత్స పొందుతున్నారు. అలాగే మడమనూరు గ్రామానికి చెందిన ఉడతా విజయ్‌కుమార్ శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. వీరిద్దరినీ ఎమ్మెల్యే నెల్లూరులోని ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. కాగా, చెర్లోపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు కలికి వేణుగోపాల్‌రెడ్డి సోదరుడు కలికి రామసుబ్బా రెడ్డి ఆదివారం రాత్రి మృతి చెందడంతో ఆయన నివాసానికి సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేరుకుని నివాళులు అర్పించారు. వేణుగోపాల్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు సాని వెంకట రమణయ్య, పొన్నూరు అశోక్ పాల్గొన్నారు.



రామసుబ్బారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మూడేళ్ల చిన్నారి అప్పగింత

నెల్లూరు(క్రైం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని నాలుగో మైలు ప్రాంతానికి చెందిన షేక్ జలీల్ భార్యాపిల్లలతో కలిసి భగత్‌సింగ్ కాలనీలోని బంధువుల ఇంటికి ఈనెల 29న వెళ్లారు. రాత్రి కావడంతో అక్కడే నిద్రపోయారు. ఈ క్రమంలో మూడేళ్ల వారి కుమార్తె తప్పిపోయింది. అదే రోజు అర్ధరాత్రి నవాబుపేట సీఐ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బందితో కలిసి నైట్‌రౌండ్స్‌లో భాగంగా టిడ్కో ఇళ్లకు వెళ్లారు. చిన్నారి రోడ్డుపై ఏడుస్తూ కన్పించడంతో నవాబుపేట స్టేషన్‌కు తీసుకువెళ్లారు. సిబ్బంది ఆ పాపకు పాలు పట్టించి నిద్రపుచ్చారు. ఉదయం పాప ఫొటోను తీసుకొని టిడ్కో ఇళ్లలో విచారించి తల్లిదండ్రులను గుర్తించారు. సోమవారం తల్లిదండ్రులకు ఆ పాపను అప్పగించారు.

రైల్వే గేట్ ఎదురుగా గుంతలు పూడ్చండి

కోవూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పడుగుపాడు రైల్వే స్టేషన్ సమీపంలో ఎన్టీఎస్ గేటు ఎదురుగా రైల్వే లైనులో పడిన గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు టీడీపీ నాయకులు సోమవారం నెల్లూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఇటీవల రైలు గేటుదాటుతూ మోపెడ్ వాహనం గుంతల్లో పడి లేచేలోగా రైలు ఢీకొని హుస్సేన్‌బాషా అనే వ్యక్తి మృతి చెందిన విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పడుగుపాడు రైల్వే స్టేషన్ నుంచి ఎన్టీఎస్ గేటు వరకున్న రైల్వేలైనును పరిశీలించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జెట్టి మదన్‌మోహన్‌రెడ్డి, బత్తల రమేష్, పఠాన్ నజీర్, డీసీఎన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రైల్వే అధికారులకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

విద్యార్థులకు పలకలు, పుస్తకాల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాళెం గిరిజన కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సహారా ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పలకలు, నోటు పుస్తకాలు, బలపాలు, రబ్బర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో-2 పీవీ రత్నం మాట్లాడుతూ పేద పిల్లల చదువులకు ప్రభుత్వం అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపిచాలన్నారు. పేద పిల్లలకు సేవ చేయాలనే సదుద్దేశంతో తమ సంస్థ దాతల సహకారాలతో విద్యాసామగ్రి అందజేస్తున్నట్టు సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు.



పుస్తకాలు, పలకలు పంపిణీ చేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు దాతలు

పేద పిల్లలకు చేయూత

బుచ్చిరెడ్డిపాళెంలోని మంగళపాళెంలో తండ్రిని కోల్పోయిన అనీష్‌తేజ, మేఘనతోపాటు మరో పేద కుటుంబానికి చెందిన అక్షర అనే బాలిక చదువు కోసం టీడీపీ నేతలు, మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మి, కోదండరామిరెడ్డి దంపతులు చేయూతనిచ్చారు. రూ.12 వేల, పుస్తకాలు అందజేసినట్లు స్థానిక గోపాల కృష్ణయ్య స్కూలు కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్ సోమవారం తెలిపారు.

వైద్యులు ప్రత్యక్ష దైవాలు

ముత్తుకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్‌డే సందర్భంగా రావి ఆకుపై కార్వింగ్‌తో వైద్యుల సింబల్‌ను రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు ముత్తుకూరుకు చెందిన సూక్ష్మ చిత్రకారుడు సోమా పద్మారత్నం. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు భూలోకంలో ప్రత్యక్ష దైవాలని పేర్కొన్నారు.



మీడియా గొంతు నొక్కేయాలనుకోవడం అవివేకం

● జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి

వెంకటాచలం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు మీడియా గొంతు నొక్కేయాలనుకోవడం వారి అవివేకమని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో సోమవారం హైదరాబాద్‌లోని మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై రెండురోజుల క్రితం బీఆర్ఎస్ నేతలు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బీఆర్ఎస్ అల్లరి మూకలపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని, నేతలు సందురి శ్రీహరి, చెంచయ్య, షేక్ రహీమ్, సుబ్రహ్మణ్యం, అశోక్, మస్తాన్, చిన్న, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ కామాంధుడి నుంచి రక్షణ కల్పించండి!

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

● తల్లీకూతుళ్ల వేడుకోలు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఓ వితంతువును కాశీపాళెంకు చెందిన ఓ వ్యక్తి ఏడాది క్రితం లోబరుచుకున్నాడు. అంతటితో ఆగని ఆ కామాంధుడు ఆమె 17 ఏళ్ల కుమార్తెపైనా కన్నేశాడు. ఇది గమనించిన ఆ తల్లి అతడిని వదిలించుకుంది. అయినా అతగాడి తీరులో మార్పు రాలేదు. మద్యం మత్తులో తరచూ నీ కుమార్తెను పంపకుంటే అంతుచూస్తానంటూ వేధించడం మొదలుపెట్టాడు. ఈ నెల 24వ తేదీన దాడి చేయడంతో తల్లీకూతుళ్ల ఇద్దరూ మరుసటి రోజు బుచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం కాలేజీకి వెళ్తున్న తనను వెంటబడి తరుముకున్నాడని ఆ బాలిక కన్నీటిపర్యంతమైంది. ఆ కామాంధుడి నుంచి తనను, తన బిడ్డను కాపాడాలని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత మహిళ కన్నీటిపర్యంతమైంది. ఈ విషయమై సీఐ శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా బాధిత మహిళ సోమవారం శాంతినగర్‌లో గ్రామసభలో తెలిపిందని, విచారిస్తున్నట్లు చెప్పారు.

ఆక్రమణదారుల నుంచి పొదలకూరు చెరువును కాపాడండి

● బీజేపీ నాయకులు డిమాండ్

పొదలకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణల చెర నుంచి పొదలకూరు చెరువును కాపాడాలని, అదేవిధంగా పేరుకుపోయిన చెత్త, చెదారాలను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్ నాయకులతో కలిసి చెరువును పరిశీలించారు. అనంతరం మండల తహసీల్దారు శివబాలకృష్ణయ్యను, ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ పొదలకూరు చెరువు ఆక్రమణలతో కుంచించుకుపోయిందని, ఆక్రమణల చెర నుంచి కాపాడాలని అధికారులను కోరారు. అదేవిధంగా ప్రైవేటు ఆసుపత్రులలో వాడిపడేసిన సిరంజ్‌లు, వ్యర్థాలను తీసుకొచ్చి చెరువు సమీపంలో వేస్తున్నారని, వాటిని నిషేధించాలని, పంచాయతీ పాలకవర్గం ఈ విషయంపై దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా తుమ్మచెట్లు విపరీతంగా పెరిగిపోయాయని వాటికి వేలంపాట నిర్వహిస్తే పంచాయతీకి రాబడి వస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు, నాయకులు గడుపూడి వేణుగోపాల్ నాయుడు, అక్కెం జనార్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, బల్లి పిచ్చయ్య, రంగారావు, రాచపూటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

C.R.I.M.E N.E.W.S

లారీలో నుంచి పడి క్లీనర్ మృతి

కోవూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోవూరుకు సమీపంలోని నందలగుంట వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న లారీలో నుంచి కిందపడి క్లీనర్ మృతి చెందిన ఘటన సోమవారం వేకువజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తిరుపతి పట్టణంలోని లీలామహల్ సెంటర్ ప్రాంతానికి చెందిన నాగరాజు (65) చాలా కాలం నుంచి లారీ క్లీనర్‌గా జీవనం సాగిస్తున్నారు. పది రోజుల కిందట లారీలో తిరుపతి నుంచి రాయపూర్‌కు వెళ్లాడు. తిరిగి రాయపూర్ నుంచి ఐరన్‌ఓర్ లోడుతో చెన్నైకి వెళుతుండగా నిద్ర మత్తులో లారీలో నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. వేగంగా వెళ్తున్న లారీ నుంచి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నాగరాజు మృతదేహం

గుండెపోటుతో లారీడ్రైవర్...

నెల్లూరురూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో లారీ డ్రైవర్ మృత్యువాత పడ్డాడు.ఈ సంఘటన సోమవారం వెలుగు చూసింది. రూరల్ సీఐ గుంజి వేణు కథనం మేరకు, తమిళనాడులోని శీలం సమీపాన ఉన్న పట్టిపళయం ప్రాంతానికి చెందిన రాజశేఖరన్ (46) పదేళ్లగా లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెన్నై నుంచి ఎక్స్‌కవేటర్ విడిభాగాలను విజయవాడకు తీసుకెళ్లి అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. అల్లీపురంలోని రైస్‌మిల్లులోని ధాన్యం లోడ్ చేసుకునేందుకు ఆదివారం వచ్చాడు. కూలీలు సోమవారం వస్తారని, అప్పటి వరకు మిల్లువద్దే ఉండాలని మిల్లు సిబ్బంది చెప్పడంతో అక్కడే వండుకుని తిని లారీ కేబిన్‌లో పడుకున్నాడు. నిద్రలోనే గుండెపోటుకు గురై మరణించినట్లు సోమవారం గుర్తించామని సీఐ పేర్కొన్నారు. అతడి భార్య గోమతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

సైదాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలోని హరిజనవాడలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హరిజనవాడకు చెందిన కాకాని వెంకటరమణయ్య (37) కువైట్‌లో పనిచేస్తూ నాలుగు రోజుల క్రితం ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం భార్య భాగ్యమ్మతో గొడవ జరిగింది. దీంతో మన స్థాపం చెందిన వెంకటరమణయ్య ఇంట్లోకి వెళ్ళి ఫ్యాన్‌కు ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాంతి కుమార్ తెలిపారు.



వెంకట రమణయ్య (ఫైల్)

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

సీతారామపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదం లో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గంధంవారిపల్లి గ్రా మం మలుపు వద్ద సోమవారం జరిగిం ది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా దర్శిగుంటపేట నుంచి మండలంలోని సంజీవరెడ్డి నగర్ గ్రామానికి మోటారు సైకిల్‌పై బయలుదేరిన ముగ్గురు వ్యక్తులు మార్గ మధ్యంలో జాతీయ రహదారిపై నుంచి గంధంవారిపల్లి గ్రామంలోకి వెళుతున్న ఓ ట్రాక్టర్ ట్రేలీని ఢీకొన్నారు. ఈ ఘటనలో సంజీవరెడ్డి నగర్‌కు చెందిన శేఖర్, దేవండ్ల జ్యోతి, బత్తుల గుర్రమ్మలు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది

నీటిగుంటలో పడి మహిళ దుర్మరణం

మర్రిపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి నీటి గుంటలో పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన మర్రిపాడు మండలం పొంగూరు బీసీ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాలనీలో నివాసం ఉంటున్న సునీత (38) సోమవారం ఉపాధిహామి పనికెళ్లి ఇంటికొచ్చింది. తన ఇంటిలో కుళాయి నీటికోసం ఏర్పాటుచేసుకున్న నీటి గుంట వద్దకు కాళ్ల కడుక్కునేందుకు వెళ్లింది. ప్రమాదవ శాత్తు కాలుజారి గుంటలో పడిపోవటంతో ఊపిరి ఆడక మృతి చెందింది. చుట్టుపక్కల వారు గుర్తించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.



సునీత మృతదేహం

సిలిండర్ల చోరీ నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ డెలివరీ బాయ్స్‌ను ఏమార్చి ఆటోలో నుంచి ఫుల్ గ్యాస్ సిలిండర్లను దొంగలించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని సంతపేట పోలీసుస్టేషన్‌లో నిందితుల వివరాలను సీఐ దశరథ రామారావు సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఈనెల 28న ఉదయం గ్యాస్ ఏజెన్సీలో ఇద్దరు డెలివరీబాయ్స్, వారు పని చేసే గ్యాస్‌గోదాముల నుంచి గ్యాస్ సిలిండర్లను ఆటోలో లోడ్ చేసుకొని డెలివరీ పాయింట్స్‌లో గ్యాస్ డెలివరీ చేసుకొని నాలుగు కాళ్ల మండపం, గుప్తా పార్క్ వద్ద తమ ఆటోలను పక్కన ఆపి టిఫిన్ చేసేందుకు వెళ్లారు. టిఫిన్ చేసి వారు తిరిగి వచ్చి చూడగా ఆటోలో గ్యాస్ సిలిండర్లు కనిపించలేదు. దీంతో వారు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతపేట సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారంగా నిందితులు నగరంలోని లేక్‌వ్యూ కాలనీలో షైనూరు కార్తీక్, విడవలూరు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన అనూష్ కుమార్‌గా గుర్తించారు. నిందితుల నుంచి రూ.1.15 లక్షల విలువ చేసే 23 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ దశరథరామారావు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	228

కోడిగుడ్ల ధర (100): 590

మొరాయించిన లీక్ క్లీనర్ మిషన్



నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్వర్ణాల చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క కారణంగా రొట్టెల పండుగ నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సోమవారం మంత్రి పొంగూరు నారాయణ గుర్రపుడెక్క తొలగించేందుకు తీసుకువచ్చిన లీక్ క్లీనర్ మిషన్‌కు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధరరెడ్డితో కలిసి పచ్చజెండా ఊపారు. దీంతో చెరువులో గుర్రపుడెక్క సమస్య తొలగుతుందని, బోట్ షికారు కొనసాగుతుందని ఆశించిన భక్తులకు తీవ్రనిరాశే మిగిలింది. మంత్రి ప్రారంభించిన తర్వాత నుంచి ఆ మిషన్ పని చేయకుండా నిలిచిపోయింది. గుర్రపుడెక్క సమస్య తీరేదెప్పుడో.. బోట్ షికార్ సాగేదెన్నడో బారాషహీద్‌లే నిర్ణయించాలని భక్తులు అంటున్నారు.

డాక్టర్ సిద్దానాయక్ సేవలు అభినందనీయం



డాక్టర్ సిద్దానాయక్‌ను సన్మానిస్తున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం) జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ అందించిన వైద్య సేవలు అభినందనీయమని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి అన్నారు. సోమవారం జీజీహెచ్ సమావేశ మందిరంలో డాక్టర్ సిద్దానాయక్ పదవీ విరమణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలు అందించటంలో సిద్దానాయక్ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోవింద, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి తదితరులు మాట్లాడారు. చివరగా డాక్టర్ సిద్దానాయక్ మాట్లాడుతూ 250మంది ఇన్‌పేషెంట్లుగా ఉండే జీజీహెచ్‌లో ప్రస్తుతం 600 మంది ఇన్‌పేషెంట్‌లుగా చేరేందుకు కృషి చేశామని వివరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర, డాక్టర్ సునీల్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, మల్లికార్జున, ఎం సురేష్, డాక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కి 47 వినతులు



వినతులు పరిశీలిస్తున్న కార్పొరేషన్ అధికారులు

నెల్లూరు(సిటీ), జూన్30 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కి 47 మంది వినతులు అందించినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ, సిటీ ప్లానింగ్, హౌసింగ్, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి నగరవాసులు అర్జీలు అందించినట్లు తెలిపారు. వీటన్నింటిని ఆయా విభాగాలకు పంపి శాశ్వత పరిష్కారాలకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ నందన్ తెలిపారు. కోటమిట్టలోని షాదీమంజిల్‌లో మౌలికసదుపాయాలు సమకూర్చాలని సీపీఐ నాయకులు సిరాజ్, షానవాజ్ వినతిపత్రం అందచేశారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటారని సీఐటీయూ నాయకులు పెంచల నరసయ్య డీసీ చెన్నుడుకి వినతిపత్రం ద్వారా తెలిపారు.

పాఠశాలకు కూలర్ బహూకరణ



కూలర్‌ను అందచేసిన దాతలు

నెల్లూరురూరల్,జూన్30,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమంచర్ల జడ్పీ హైస్కూల్‌కు సోమవారం జువాజీ శ్రీనివాసులు నాయుడు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పద్మావతమ్మ, కుమారుడు మల్లికార్జున్‌నాయుడు రూ. లక్ష విలువ చేసే వాటర్ కూలర్‌ను బహూకరించారు. అలాగే పాఠశాలలో పది ఫలితాల్లో మొదట స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 25 వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని అందించిన వీరు, ఇంటర్ మొదట సంవత్సరం ఫీజు మరో రూ. 25 వేలను అందచేశారు. దాతలు తమ పాఠశాలకు ఇంతటి చేయూతనందించడం అభినందనీయమని హెచ్ఎం రాజు తెలిపారు. విద్యార్థులు మరింత పట్టుదలతో చదివి మంచి మార్కులు, పేరు తెచ్చుకోవాలని ఆయన కోరారు.

వికాస్ పాఠశాలలో గ్రేప్స్ డే వేడుకలు



ద్రాక్ష వేషధారణలతో చిన్నారుల ప్రదర్శన

నెల్లూరు(విద్య), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ వికాస్ హైస్కూల్‌లో సోమవారం గ్రేప్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ద్రాక్ష విశేషపండుగా వైద్యులు గుర్తించారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ద్రాక్ష పండ్ల ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు తెలియచేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఆకర్షణీయమైన ద్రాక్షల వేషధారణలతో చేసిన ఆరోగ్య ప్రయోజనాలను తెలియచేసే ప్రదర్శనలు, నాటికలు, సందేశాలు ఇవ్వగా అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిప్రతాప్, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్న, వస్త్రదానం



పేదలకు వస్త్రదానం చేస్తున్న గాదంశెట్టి గోపాల్

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట కేపీసీ ఎస్టేట్‌లో సోమవారం తల్పగిరి రంగనాథస్వామి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ మెంబరు కామిశెట్టి హైమావతమ్మ మూడో వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం, వస్త్రదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె సోదరుడు కామిశెట్టి ఆదిశేషయ్యశెట్టి, హైమావతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గాదంశెట్టి గోపాల్ నిర్వహించారు.

జడ్పీ ఏవోకి ఘనంగా వీడ్కోలు



కొండయ్య దంపతులకు సన్మానం

నెల్లూరు(జడ్పీ)జూన్30 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఏవో కొండయ్య పదవీ విరమణ చేయడంతో ఆయనకు జిల్లాపరిషత్‌లో సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లా డుతూ 1986లో టైపిస్టు హోదాలో ఉద్యోగం పొందిన కొండయ్య వివిధ హోదాల్లో ఇప్పటి వరకు పనిచేశారని, ఏ హోదాలో పనిచేసినా ఆ పదవులకే వన్నెతెచ్చారన్నారు. ఉద్యోగస్తులకు ఆయన మార్గదర్శిగా నిలిచారన్నారు. సీఈవో మోహన్‌రావు మాట్లాడుతూ కరోనా సమయంలో అధికారులకు తోడ్పాటుని అందించటంలో ఆయన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జడ్పీటీసీలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

అరుగును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్రాంతినగర్‌లో చెంచమ్మ తల్లి (వేపచెట్టు) అరుగును ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నేత ఏవీఆర్ మోహన్‌రావు, బీజేపీ నేతలు మిడతల రమేష్, వీ.సునీల్‌రెడ్డి సోమవారం డీఆర్వో ఉదయభాస్కర్‌కు విజ్ఞప్తి చేశారు. మూడు రోజుల క్రితం ఈ అరుగును ధ్వంసం చేస్తే అరుంధతీయులు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని పేర్కొన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కిడ్నాప్ ముఠాలపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేద గిరిజన, యానాదుల తల్లిదండ్రులను ఏమార్చి వారి పిల్లలను కిడ్నాప్ చేసే ముఠాల దురాగతాలు పెరిగిపోతున్నాయని ఆలిండియా యానాది మహానాడు జిల్లా అధ్యక్షుడు చౌటూరు శీనయ్య తెలిపారు. సోమవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కిడ్నాప్ చేసిన యానాది పిల్లలను వివిధ పనుల్లో చేర్పించి వెట్టిచాకిరీ చేయిస్తు వారి భవిష్యత్తును నాశం చేస్తున్నారని తెలిపారు. కిడ్నాపర్లపై ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోకుండా మేనేజ్ చేస్తున్నారని తెలిపారు. వీరి ఆగడాలను అరికట్టాలని కోరారు. యానాది పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు ఎవరైనా గుర్తిస్తే తన మొబైల్ నెంబరు 93811 77450ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చౌటూరు శీనయ్య, శీనమ్మ, మస్తానమ్మ, శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అమీర్ ఆర్ట్స్ ఆకాడమీకి ఐఎస్‌వో గుర్తింపు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టెక్కేమిట్టలో ఉన్న చిత్రకళా శిక్షణ సంస్థ అమీర్ ఆర్ట్స్ అకాడమీకి ఐఎస్‌వో 90001:2015 గుర్తింపు లభించింది. ఈ అకాడమీని గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ గ్రహీత డాక్టర్ అమీర్‌జాన్ పదేళ్లుగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఢిల్లీకి చెందిన డెల్టా గ్లోబల్ సర్టిఫికెట్ సొసైటీ నుంచి గుర్తింపు పత్రం వచ్చింది.

న్యూస్ బాక్స్

చేస్తున్న మంచిని ప్రతి ఇంటికి వెళ్లి వివరిద్దాం : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరురూరల్, జూన్30,(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని ప్రతీ ఇంటికి వెళ్లి వివరిద్దామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 2 నుంచి సుపరిపాలనలో తొలిఅడుగు పేరిట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని ప్రతీ ఇంటికి వెళ్లి వివరిద్దామని స్పష్టం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరుశాతం స్థానాలకు దక్కించుకోవాలని, ఆ దిశగా ప్రజలకు చేరువవ్వాలని తెలిపారు. ఎక్కడ లేని విధంగా రూరల్ నియోజకవర్గంలో భారీగా నిధులను సమీకరించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, వాటిని క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు.

చిరంజీవిపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 30: డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి సోమవారం పదవీ విరమణ చేసిన కొప్పోలు చిరంజీవిపై చర్యలు తీసుకోవాలని ఆ అసోసియేషన్ సభ్యుడు పీ. ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. చిరంజీవి 2015 నుంచి బాధ్యతలు నిర్వహిస్తూ అసోసియేషన్‌కు చెందిన నగరంలోని రాజు భవన్‌లో ఉన్న దుకాణాల అడ్వాన్సులు, బాడుగలు దండుకుని, దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్ విచారణ చేశారన్నారు. నూతనంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోయేవారు ఆ విషయం తెలుసుకుని బాధ్యతలు చేపట్టాలన్నారు. చిరంజీవి నుంచి ఆ నిధులను రాబట్టి అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యానాది కాలనీల్లోని పాఠశాలలను ఎత్తివేయవద్దు



కలెక్టరేట్ వద్ద దళితుల ధర్నా

నెల్లూరు(హరనాథపురం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): యానాదికాలనీల్లో ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయవద్దని దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నాయకులు, మహిళలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడుతూ బోగోలు మండలం కొండబిట్రగుంట యానాదికాలనీలో 46 మంది యానాది విద్యారులున్న పాఠశాలను పక్క గ్రామంలోని పాఠశాలలో కలిపి వేశారన్నారు. ఇది దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. యానాది కాలనీల్లో ఉన్న పాఠశాలలను అక్కడే ఉంచి ప్రాథమిక విద్యను అందించాలని కోరారు. 80 శాతం మంది పిల్లలకు తల్లికి వందనం రాలేదన్నారు. ఈ ధర్నాలో కొండబిట్రగుంటకు చెందిన మహిళలతోపాటు, నాయకులు ఎస్. లక్ష్మయ్య అశోక్, రాచగిరి మురళి, పీ. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు భవనాలపై అధికారుల చర్యలు

నెల్లూరు(సిటీ), జూన్30,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జేమ్స్‌గార్డెన్ పరిధిలో పురపాలక నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రెండు భవనాలపై కార్పొరేషన్ అధికారులు సోమవారం చర్యలు తీసుకున్నారు. కే భాస్కర్, ఎం బాలక్రిష్ణలకు చెందిన భవనాలకు పార్కింగ్, జీ ప్లస్‌టూకి మాత్రమే అనుమతులుండగా, వాటిని అతిక్రమించిన యజమానులు అదనంగా మరో రెండు అంతస్తులను నిర్మించారు.ఈ మేరకు పీవో, సీవోలు ఇప్పటికే నోటీసులిచ్చి భవనాలను సీజ్ చేశారని టీపీవో సతీష్ తెలిపారు. ఈ క్రమంలో అదనపు కట్టడాలను తొలగించినట్లు చెప్పారు. కాగా ఈ భవనాలను కమిషనర్ వైవో నందన్ కూడా పరిశీలించారు.

పోషకాహార కిట్ల పంపిణీ



కిట్లు అందుకున్న బాధితులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొండాయపాలెంలో అ బైండింగ్ హోప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం క్యాన్సర్ బాధితులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.టైటస్ నిర్మల్‌కుమార్, జయప్రకాష్, క్రాంతి, సిస్టర్ రమ, జయ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

వీడని గందరగోళం

- జాయినింగ్ తేదీల్లో తప్పులు
- సీనియారిటీ కోల్పోయిన సచివాలయ ఉద్యోగులు

నెల్లూరు(సిటీ), జూన్30(ఆంధ్రజ్యోతి): నగరంలోని వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను జాయినింగ్ తేదీల తప్పులు వెంటాడుతున్నాయి. సుదీర్ఘ కాలం అనంతరం ప్రభుత్వం బదిలీలకు పచ్చజెండా ఊపింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్నీ మున్సిపాలిటీలతో పాటు నగరంలోని సచివాలయ ఉద్యోగులకు శనివారం ఎన్ఎంసీ కార్యాలయంలో బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఇందులో కొంతమంది ఉద్యోగులకు 2019 అక్టోబరు 2న, మరికొందరికి 11న జాయినింగ్ ఉండటంతో సీనియార్టీ కోల్పోయామని, దీంతో బయట మున్సిపాలిటీలవాళ్లు నెల్లూరుకు బదిలీపై వచ్చేందుకు అప్షన్ కోరుకున్నట్లు సోమవారం ఉద్యోగులు కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. అందరికీ ఒకేరోజు నియామక ఉత్తర్వులు అందగా, జాయినింగ్ తేదీలు మాత్రం వేర్వేరుగా ఉండటంతో జాబితాల్లో పేర్లు కోల్పోయామని వారు వాపోయారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని వారు ఉన్నతాధికారులను కోరారు.

రొట్టెల పండుగకు పకడ్బందీగా ఏర్పాటు



బారా షహీద్ దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 30 : జూలై 6 నుంచి నగరంలో జరిగే రొట్టెల పండుగకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన దర్గా ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్వర్ణాల చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించే పనులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా రొట్టెల పండుగకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2014-19లో తాను మంత్రిగా ఉన్న సమయంలో దర్గాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లు, టాయిలెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రత్యేకించి మహిళల కోసం రూమ్‌లు నిర్మించామని వివరించారు. దర్గాలో హాల్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు రూ.5కోట్లు విడుదల చేశారని, మెరుగైన డిజైన్‌తో హాల్ నిర్మించేందుకు రూ.9కోట్లు ఖర్చవుతుందని వివరించారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని, మరో రెండు రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 6 గంటలకు బారాషహీద్ దర్గా కమిటీ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. మంత్రి పొంగూరు నారాయణ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ వైవో నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, మైనార్టీ నాయకులు, టీడీపీ ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని కాలువల్లో పూడికతీత

నెల్లూరు(సిటీ), జూన్30(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నగరంలోని 6.7 కి.మీ మేర కాలువల్లో పూడికతీత చేపట్టామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం 45వ డివిజన్ పొగతోటలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలు వస్తే మురుగు కాలువల్లో నీరు సులువుగా బయటకు వెళ్లేందుకు వీలులుంటుందని తెలిపారు. రానున్న 15 రోజుల్లో ఈ పనులన్నీ పూర్తవుతాయని, నాణ్యతను దృష్టిలో పెట్టుకుని పనులు జరగాలని ఆదేశించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తీసేయడం వల్ల మురుగు నిల్వ ఉండకుండా వెళ్లిపోతుందని చెప్పారు. ఖజానాలో డబ్బులు లేకపోయినా ప్రజారోగ్యం దృష్ట్యా పనులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వైవో. నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నాయకులు తాళ్లపాక అనూరాధ, మధు, డాక్టర్ పోకల రవి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ హైస్కూల్‌లో డిజిటల్ బోధన

- 7న విద్యాశాఖామంత్రి లోకేష్‌తో ప్రారంభం
- మంత్రి నారాయణ



వీఆర్ హైస్కూల్ తరగతి గదిలో విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వీఆర్ హైస్కూల్‌లో విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ బోధన అందించనున్నామని రాష్ట్ర పురపాలకశాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని వీఆర్ హైస్కూల్‌లో సోమవారం ప్రైమరీ తరగతులను మంత్రి లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. అన్ని వసరులతో పూర్తిస్థాయిలో సిద్ధమైన వీఆర్ హైస్కూల్, క్రీడామైదానాన్ని అధికారంగా జూలై 7న రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు సోమవారం తరగతులు ప్రారంభించామని, 6 నుంచి 9వతరగతి వరకు తరగతులను జూలై 3న ప్రారంభిస్తామన్నారు. వీఆర్ హైస్కూల్ తరహాలోనే మరో రెండు స్కూళ్లను సిద్ధం చేసేందుకు డీఎస్ఆర్ కంపెనీ, ఎంపీ వీపీఆర్ ముందుకు రావడం అభినంద నీయమన్నారు. అనంతరం తల్లిదండ్రులు, పిల్లలతో మంత్రి ముచ్చటించగా, విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంగా తరగతులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జేసీ కే.కార్తీక్, మునిసిపల్ కమిషనర్ నందన్, టీడీపీ నేతలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, అధికారులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆధునీకరణ

నగరంలోని మూలాపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆధునీకరణ పనులను ప్రారంభించి అత్యాధునికంగా తీర్చిదిద్దుతామని పురపాలకశాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. బాలికోన్నత పాఠశాలను సోమవారం మంత్రి పరిశీలించి మాట్లాడారు. ఈ పాఠశాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, జూలై 7న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. పాఠశాలలో వెయ్యిమందికి పైగా విద్యార్థినులకు ఉత్తమ విద్యనందించేలా పాఠశాలను తీర్చిదిద్దుతామన్నారు. వీటితోపాటు నగరంలోని మరో 54 ప్రభుత్వ పాఠశాలను వచ్చే నాలుగేళ్లలో అత్యాధునికంగా తీర్చిదిద్ది అన్ని వసతులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. డీఎస్ఆర్ కంపెనీ అధినేత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులు చూసిన తరువాత తాను కూడా ఒక పాఠశాలను దత్తత తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. అనంతరం మంత్రి ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

మత్స్యశాఖ జేడీకి ఘనంగా వీడ్కోలు



మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 30(ఆంధ్రజ్యోతి):మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన నాగేశ్వరరావుకు ఆశాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. నెల్లూరు ఎన్జీవో హోంలో సోమవారం మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో జేడీకి పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్లు అంజలి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని నాగేశ్వర రావు సేవలను కొనియాడారు. ప్రభుత్వ పథకాలను మత్స్యకారులకు అందించడంలో ఆయన ఎంతో కృషి చేశారని పలువురు అతిథులు అభినందనలు తెలిపారు. అనంతరం నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఏపీఎంఐపి పీడీ శ్రీనివాసులు, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, పశుసంవర్ధకశాఖ డీడీ సోమయ్యలతోపాటు మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజనకాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు సోమ వారం డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏటూరు రామిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ డీ.మనోహర్ రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ శారద పాల్గొన్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా తిరుపతయ్య

ఆత్మకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్టీ మోర్చా పట్టణ నూతన అధ్యక్షుడిగా తిరుపతయ్యను నియమించినట్లు ఆ పార్టీ సీనియర్ నాయకులు కరటంపాటి సుధాకర్, పట్టణ అధ్యక్షుడు నున్నా సంతోష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం వారు తిరుపతయ్యకు పార్టీ కండువాను కప్పి అభినందించారు. ఆత్మకూరు పట్టణంలో బీజేపీ పటిష్ఠతకు కృషిచేయాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9230
వెండి కిలో ధర	రూ. 108900
వెండి ఒక గ్రాము	రూ. 111.90

కబ్జా కోరల్లో పోరంబోకు భూములు, నీటి కుంటలు

● మేతకు, తాగునీటికి పశువుల వెతలు ● పాడి రైతుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు


పొలాలుగా మారిన గురవారెడ్డి గుంట


ఆక్రమణలతో కుంచించుకుపోయిన వెంగన్న గుంట

సంగం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఊరి చివర్లో పశువులకు మేత బయళ్లుగా, తాగునీటి వనరులుగా ఉన్న పోరంబోకు భూములు, నీటి కుంటలు కబ్జాకు గురికావడంతో పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని తరుణవాయి గ్రామంలో ఉత్తరం వైపు కావలి కాలువ ఎగువ భాగంలో సుమారు 17 ఎకరాల విస్తీర్ణంలో గురవారెడ్డి గుంట గ్రామంలోని పాడిపశువులకు ఆధారంగా ఉండేది. గ్రామంలోని పశువులు ఈప్రాంతంలో మేత మేస్తూ ఇందులోని నీటిని తాగేవి. కాగా, కాలక్రమేణా పోరంబోకు భూములు, నీటి గుంటలు చుట్టూ ఉన్న రైతుల కబ్జాకు గురయ్యాయి. అదేవిధంగా గ్రామ సమీపంలో ఉన్న వెంగన్న గుంట ఒకవైపు గ్రామంలోని ఓ సామాజిక వర్గం వారు శ్మశానంగా వాడుతున్నారు. మిగిలింది ఆక్రమణకు గురైంది. సుమారు ఐదు ఎకరాల గుంట ప్రస్తుతం ఎకరా కూడా లేదు. ఈవిధంగా గ్రామాల్లోని పోరంబోకు భూములు, పశువుల నీటి కుంటలు కనుమరుగవడంతో పశువుల మేతకు ఇబ్బందిగా మారి పాడిరైతులు అమ్ముకుంటున్నారు.

ఉపాధి నిధులతో నీటి తొట్టెల నిర్మాణం

నీటి కుంటలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఉపాధి నిధులతో నీటి తొట్టెలను నిర్మిస్తోంది. మండలంలో మెట్ట గ్రామాలైన పెరమన, కొరిమెర్ల, తరుణవాయి గ్రామ శివార్లలో వీటిని నిర్మించారు. వీటిలో నీటిని నిల్వ చేసేందుకు పంచాయతీ నిధులు వెచ్చిస్తున్నారు. కాగా, నీటి కుంటలు ఆక్రమణకు గురికాకుండా కాపాడి ఉంటే నీటి తొట్టెల నిర్మాణం, నీటి సరఫరా చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదని, లక్షల రూపాయల ఉపాధి నిధులు మరో అభివృద్ధి కార్యక్రమానికి వినియోగించే అవకాశం ఉండేదని పలువురు గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో పూర్వం నుంచి ఉన్న నీటి కుంటలు, పచ్చిక బయళ్లుగా ఉన్న పోరంబోకు భూములు (మేత బయళ్లు) కాపాడాలని పాడి రైతులు కోరుతున్నారు.



గ్రామాల్లో పారిశుధ్యంపై ఐవీఆర్ఎస్ నిఘా

● జీవీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో

సంగం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్)తో ప్రజలకు ఫోన్‌చేసి కనుక్కొంటుందని, దీనివల్ల పారిశుధ్యం మెరుగుకు దోహదపడుతుందని డిప్యూటీ ఎంపీడీవో జీవీఎస్‌వి ప్రసాద్ తెలిపారు.

? మండలంలోని ఎన్ని గ్రామాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం జరుగుతోంది.

! మండలంలోని పెరమ, కోలగట్ల, పడమటిపాళెం, వెంగారెడ్డిపాళెం, వంగల్లు, మక్తాపురం ఆరు గ్రామాల్లో ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణకు బుట్టలు ఇవ్వడం జరిగింది. తడి చెత్త ప్రతి రోజు, పొడి చెత్త వారానికి ఒకరోజు చొప్పున పంచాయతీ వాహనం ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

? డంపింగ్ యార్డులకు తరలించిన చెత్తను కంపోస్టు ఎరువుగా మారుస్తున్నారా. చెత్తను ఎరువుగా మార్చడం ద్వారా పంచాయతీలకు ఎంత ఆదాయం వచ్చింది.

! ఆరు పంచాయతీల్లో సేకరించిన చెత్తను కంపోస్టు ద్వారా ఎరువుగా మార్చడం జరిగింది. కేజీ ఎరువుకి ప్రభుత్వం రూ. 10 ధర నిర్ధారించింది. ఆ ధరకు కొనుగోలు చేసేందుకు రైతులు ముందుకు రాలేదు. రూ. 5లకు కూడా ముందుకు రావటంలేదు. దీంతో సుమారు 10 టన్నులకు పైగా ఎరువు సిద్ధంగా ఉంది.

? పంచాయతీలో నిధుల పరిస్థితి ఏమిటి.

! 15వ ఆర్థిక సంఘం రెండవ విడత నిధులు జమ కాలేదు. దీంతో కొన్ని పంచాయతీల్లో నిధుల కొరత ఉంది.

సైన్స్ ఉపాధ్యాయుడికి సన్మానం


సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

అనంతసాగరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ చేసిన మెట్టుకూరు సుబ్బారెడ్డిని నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎంపికైన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న కార్యదర్శులు

ఉదయగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం ఉదయగిరి మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా ఏ నాగూర్‌బీ, ఉపాధ్యక్షుడిగా బీ చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా నల్లిపోగు చిన్నబాబు, కోశాధికారులుగా ఆవుల వెంకటరమణయ్య, షేక్ మహబూబ్‌బాషాలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన వారిని పంచాయతీ కార్యదర్శులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం


ఆర్టీసీ ఉద్యోగులను సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

ఉదయగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపోలో కండక్టర్లుగా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, కృష్ణప్రభాకర్‌లను సహచర ఉద్యోగులు, బంధుమిత్రులు డిపో ఆవరణలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల సంఘాల నాయకులు, కార్మికులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ


యూరియాను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న రైతులు

సంగం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రానికి సోమవారం యూరియా వచ్చింది. ఇటీవల వరి సాగు చేసిన రైతులు యూరియా కోసం వీఏఏలకు నగదు చెల్లించారు. ఇండెంట్ మేరకు సుమారు 17.5 టన్నుల యూరియా సరఫరా అయింది. వచ్చిన యూరియాను నగదు చెల్లించిన రైతులు నేరుగా ట్రాక్టర్లు, ఆటోలలో తీసుకెళ్లారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?


కంప చెట్లతో కుంచించుకుపోయిన రహదారి

సంగం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీకి వెళ్లే రహదారిలో దళితవాడ కాలనీ మలుపు వద్ద కంప చెట్లు ఏపుగా పెరిగి సగం రహదారి మీదకు వచ్చాయి. దీంతో రహదారి కుచించుకుపోయింది. దీనివల్ల ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనిపించడంలేదు. దీంతో వేగంగా వచ్చే వాహనాల వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న సంఘటన జరిగింది. అంతకుముందు రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్యారేజీకి వెళ్లే రహదారి మీదకు వచ్చిన కంపచెట్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మస్టర్లు మాయం చేశారని ఉపాధి కూలీల ఆందోళన


ఉపాధి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కూలీలు

ఉదయగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తమ మస్టర్లను మాయం చేశారని మండలంలోని పుల్లాయపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు సోమవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ తాము ఉపాధి కూలి పనులు చేశామని, అప్పట్లో తమ పనికి సంబంధించిన మస్టర్లు, తాము పనికి వచ్చినట్లు తీసిన ఫోటోలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా అవి ఆన్‌లైన్‌లో కనిపించకుండా మాయం చేశారన్నారు. దీంతో తాము పనులు చేస్తున్నప్పటికీ కూలి నగదు అందక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. అలాగే తాము నెలల తరబడి పనులు చేసినా నగదు చెల్లింపులు జరగలేద న్నారు. దీనికి బాధ్యులెవరో తేల్చాలని డిమాం డ్ చేశారు. అనంతరం సమస్యను ఎంపీడీవో అప్పాజీ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన పూర్తిస్థాయిలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకుని కూలీలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

తెలుగుదేశం పార్టీ నూతన కమిటీల ఎంపిక


నూతన అధ్యక్షులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మహమ్మద్ జాఫర్ షరీఫ్

ఆత్మకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలోని పలు వార్డుల్లో సోమవారం పట్టణ తెలుగుదేశం పార్టీ ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన రాష్ట్ర టీడీపీ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్ షరీఫ్, పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ కొనసాగింది. 21వ వార్డు అధ్యక్షుడిగా కాసా రాధాకృష్ణ, 5వ వార్డుకు నలిశెట్టి శ్రీనివాసులు, 20వ వార్డుకు గురునాథం శీనయ్య, 9వ వార్డుకు కొప్పోలు ప్రదీప్‌రెడ్డి, 23వ వార్డుకు మాదాల ప్రసాద్‌నాయుడు నూతన అధ్యక్షులుగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ఆయా వార్డుల టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 500 మందికి నియామక పత్రాలు


మెగా జాబ్‌మేళాలో పాల్గొన్న నిరుద్యోగ యువతీ యువకులు

వింజమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేతాజీ వికాస్ డిగ్రీ కాలేజీ ఆవరణలో సోమవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారు మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువత అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 20 కంపెనీలు పాల్గొని 500 మందికి నియామక పత్రాలు అందజేశారని నిర్వాహకులు అబ్దుల్ ఖయ్యూం, కిరణ్మయి తెలిపారు. త్వరలో మరో 500 మందికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ రత్నం ప్రిన్సిపాల్ గురజాల గోపి, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్యచంద్ర, మానస, మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, గూడా నర్సారెడ్డి, సర్పంచ్ నల్లొండ సృజన, నాయకులు భాష్యం మాల్యాద్రి, జనసేన నాయకులు కొంటె వెంకటేశ్వర్లు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శారద్రవంతి

ఉదయగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వీవోఏలు వారి పరిధిలోని పొదుపు సంఘాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని ఏపీఎం శారద్రవంతి సూచించారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వీవోఏలు, సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘాల సమావేశాలను ప్రతినెలా తప్పక నిర్వహించి సంఘాల బలోపేతానికి కృషిచేయాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణాల మంజూరుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బకాయిల రికవరీలపై దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు ప్రేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అంకాళమ్మకు గ్రామోత్సవం


సింహ వాహనంపై ఊరేగుతున్న అంకాళమ్మ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఉన్న అంకాళమ్మతల్లి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిం చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారిని సింహ వాహనంపై బాణాసంచా వేడుకల నడుమ గ్రామ పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను

సీతారామపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అంగ న్వాడీ కేంద్రాల నిర్వహణలో సిబ్బంది సమయ పాలన పాటించాలని ఐసీ డీఎస్ సూపర్వైజర్ షేక్ షాను సూచించారు. ఆమె సోమవారం మండల పరి ధిలోని బెడుసుపల్లి, నాగ రాజుపల్లి, గంగవరం గ్రా మాల్లోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చే చిన్నా రులకు ఆటపాటలతో కూ డిన విద్యా బోధన అందిస్తూ ప్రీస్కూల్ హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ఫేస్ యాప్ ద్వారా పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలను అందించారు. ఈకార్యక్రమంలో ఆమెతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు నారాయణమ్మ, పణిరాజకుమారి, ఎలీసమ్మ పాల్గొన్నారు.



లారీలో నుంచి పడి క్లీనర్ మృతి


నాగరాజు మృతదేహం

కోవూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోవూరుకు సమీపంలోని నందలగుంట వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న లారీలో నుంచి కిందపడి క్లీనర్ మృతి చెందిన ఘటన సోమవారం వేకువజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తిరుపతి పట్టణంలోని లీలామహల్ సెంటర్ ప్రాంతానికి చెందిన నాగరాజు (65) చాలా కాలం నుంచి లారీ క్లీనర్‌గా జీవనం సాగిస్తున్నారు. పది రోజుల కిందట లారీలో తిరుపతి నుంచి రాయపూర్‌కు వెళ్లాడు. తిరిగి రాయపూర్ నుంచి ఐరన్‌ఓర్ లోడుతో చెన్నైకి వెళుతుండగా నిద్ర మత్తులో లారీలో నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. వేగంగా వెళ్తున్న లారీ నుంచి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో లారీడ్రైవర్..

నెల్లూరురూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో లారీ డ్రైవర్ మృత్యువాత పడ్డాడు.ఈ సంఘటన సోమవారం వెలుగు చూసింది. రూరల్ సీఐ గుంజి వేణు కథనం మేరకు, తమిళనాడులోని శీలం సమీపాన ఉన్న పట్టిపళయం ప్రాంతానికి చెందిన రాజశేఖరన్ (46) పదేళ్లగా లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెన్నై నుంచి ఎక్స్‌కవేటర్ విడిభాగాలను విజయవాడకు తీసుకెళ్లి అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. అల్లీపురంలోని రైస్‌మిల్లులోని ధాన్యం లోడ్ చేసుకునేందుకు ఆదివారం వచ్చాడు. కూలీలు సోమవారం వస్తారని, అప్పటి వరకు మిల్లువద్దే ఉండాలని మిల్లు సిబ్బంది చెప్పడంతో అక్కడే వండుకుని తిని లారీ కేబిన్‌లో పడుకున్నాడు. నిద్రలోనే గుండెపోటుకు గురై మరణించినట్లు సోమవారం గుర్తించామని సీఐ పేర్కొన్నారు. అతడి భార్య గోమతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటరమణయ్య (ఫైల్)

సైదాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలోని హరిజనవాడలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హరిజనవాడకు చెందిన కాకాని వెంకటరమణయ్య (37) కువైట్‌లో పనిచేస్తూ నాలుగు రోజుల క్రితం ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం భార్య భాగ్యమ్మతో గొడవ జరిగింది. దీంతో మన స్థాపం చెందిన వెంకటరమణయ్య ఇంట్లోకి వెళ్ళి ఫ్యాన్‌కు ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాంతి కుమార్ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది

సీతారామపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గంధంవారిపల్లి గ్రామం మలుపు వద్ద సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా దర్శిగుంటపేట నుంచి మండలంలోని సంజీవరెడ్డి నగర్ గ్రామానికి మోటారు సైకిల్‌పై బయలుదేరిన ముగ్గురు వ్యక్తులు మార్గ మధ్యంలో జాతీయ రహదారిపై నుంచి గంధంవారిపల్లి గ్రామంలోకి వెళుతున్న ఓ ట్రాక్టర్ ట్రీలీని ఢీకొన్నారు. ఈ ఘటనలో సంజీవరెడ్డి నగర్‌కు చెందిన శేఖర్, దేవండ్ల జ్యోతి, బత్తుల గుర్రమ్మలు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

నీటిగుంటలో పడి మహిళ దుర్మరణం


సునీత మృతదేహం

మర్రిపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి నీటి గుంటలో పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన మర్రిపాడు మండలం పొంగూరు బీసీ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాలనీలో నివాసం ఉంటున్న సునీత (38) సోమవారం ఉపాధిహామి పనికెళ్లి ఇంటికొచ్చింది. తన ఇంటిలో కుళాయి నీటికోసం ఏర్పాటుచేసుకున్న నీటి గుంట వద్దకు కాళ్లు కడుక్కునేందుకు వెళ్లింది. ప్రమాదవ శాత్తు కాలుజారి గుంటలో పడిపోవటంతో ఊపిరి ఆడక మృతి చెందింది. చుట్టుపక్కల వారు గుర్తించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

సిలిండర్ల చోరీ నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ డెలివరీ బాయ్స్‌ను ఏమార్చి ఆటోలో నుంచి ఫుల్ గ్యాస్ సిలిండర్లను దొంగలించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని సంతపేట పోలీసుస్టేషన్‌లో నిందితుల వివరాలను సీఐ దశరథ రామారావు సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఈనెల 28న ఉదయం గ్యాస్ ఏజెన్సీలో ఇద్దరు డెలివరీబాయ్స్, వారు పని చేసే గ్యాస్‌గోదాముల నుంచి గ్యాస్ సిలిండర్లను ఆటోలో లోడ్ చేసుకొని డెలివరీ పాయింట్స్‌లో గ్యాస్ డెలివరీ చేసుకొని నాలుగు కాళ్ల మండపం, గుప్తా పార్క్ వద్ద తమ ఆటోలను పక్కన ఆపి టిఫిన్ చేసేందుకు వెళ్లారు. టిఫిన్ చేసి వారు తిరిగి వచ్చి చూడగా ఆటోలో గ్యాస్ సిలిండర్లు కనిపించలేదు. దీంతో వారు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతపేట సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారంగా నిందితులు నగరంలోని లేక్‌వ్యూ కాలనీలో ఫైనూరు కార్తీక్, విడవలూరు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన అనూష్ కుమార్‌గా గుర్తించారు. నిందితుల నుంచి రూ.1.15 లక్షల విలువ చేసే 23 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ దశరథరామారావు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	228

కోడిగుడ్ల ధర (100): 590

ఎన్జీవో కాలనీ ఏర్పాటు చేయాలి

కావలిటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఎన్జీవో కాలనీ ఏర్పాటు చేయాలని సోషల్ రిఫార్మర్స్ కోరారు. సోమవారం పట్టణంలోని కృష్ణం రాజేశ్వరమ్మ కల్యాణ మండపంలో సోషల్ రిఫార్మర్స్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల సమావేశం జరిగింది. సామాజిక పర్యావరణ, విద్య, ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, ప్రకృతి వైపరీత్యాల సహాయ సహకరాలు తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ పొందిన స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఎన్జీవో కాలనీ, కార్యాలయం ఏర్పాటు తదితర ప్రధాన డిమాండ్లతో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి చర్చలు జరపాలని తీర్మానించారు. సమావేశంలో వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఎండీ రెహెమాన్, ఖాదర్‌బీ, చేవూరి చిన్న, అబ్దుల్ అలీం, తోట వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, వినయ్‌కుమార్, సాయితేజ, రాయపాటి దిలీప్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో డివిజన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆర్డీవో ఎం. సన్నీ వంశీ కృష్ణకు వినతిపత్రాలు అందచేశారు.

● దివ్యాంగులందరికీ ఇళ్ల వద్దకే రేషన్ బియ్యం అందివ్వాలనే ప్రభుత్వ లక్ష్యం ఆచరణలో నెరవేరడం లేదని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మున్నవ వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు దివ్యాంగులతో కలిసి కావలి ఆర్డీవోకి ఎక్కడక్కడ రేషన్ అందటం లేదో వాటి వివరాలతో సహా వినతిపత్రం అందచేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో వెంటనే సంబంధిత సిబ్బందితో మాట్లాడి వెంటనే రేషన్ అందే ఏర్పాట్లు చేయిస్తానని చెప్పారు.



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

● కావలి పట్టణానికి చెందిన ఒక పేపర్‌బాయ్ సతీమణి వీ శాంతి తన ఇద్దరి పిల్లలను ఓ పాఠశాలలో చదివిస్తుండగా అధిక ఫీజులు చెల్లించలేక మరొక పాఠశాలలో చేర్పించేందుకు టీసీ అడిగితే ఈ ఏడాది పూర్తి ఫీజులు కడితేనే టీసీలు ఇస్తామని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చెపుతున్నారని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. టీసీలు ఇస్తే కాని ప్రస్తుతం తాము చేర్పించిన పాఠశాలలో తల్లికి వందనం రావడం లేదన్నారు. పేద కుటుంబమైనందున తాము పాత పాఠశాలలో ఫీజులు చెల్లించలేమని తమ పిల్లలకు టీసీలు ఇప్పించాలని కోరారు.

● డివిజన్ కేంద్రమైన కావలిలో ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలలు లేవని, వాటిని ఏర్పాటు చేయించాలని బీసీ ఐక్యత భవన్ నేతలు అద్దంకి ప్రభాకర్, చిన్ని వరప్రసాద్, ఉరిటి గోవింద్‌లు ఆర్డీవోకు వినతిపత్రం అందచేశారు. ప్రభుత్వ కళాశాలలు లేనందున ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించి చదవలేక పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.





పునాదులకే పరిమితమైన అన్నెబోయినపల్లి యూపీ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం

సరస్వతీ నిలయాల్లో సమస్యల తిష్ఠ!

లింగసముద్రం ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులు చేసిన గదులకు వేయని రంగులు

● అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

లింగసముద్రం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సరస్వతీ నిలయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు ఫేస్-2లో నిర్మాణ పనులు చేపట్టిన పలు పాఠశాలల తరగతి గదుల పనులు వివిధ దశలలో అసంపూర్తిగా నిలిచి పోయాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 37 ప్రాథమిక, 3 యూపీ పాఠశాలలు, 4 జడ్పీ హైస్కూళ్లు, ఒక కేజీబీవీ, ఒక ఏపీ మోడల్ స్కూల్, ఒక గురుకుల పాఠశాల ఉన్నాయి. ప్రస్తుతం 47 పాఠశాలలో 3,379 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో తరగతి గదులు చాలక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2లో అనేక పనులు చేపట్టారు. అయితే మంజూరు చేసిన నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం తో అనేక పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అందులో మండలంలోని మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో 2 తరగతి గదుల నిర్మాణాలకు రూ.24 లక్షలు మంజూరు కాగా, వాటి నిర్మాణాలకు రూ.8 లక్షలు ఖర్చు చేశారు. అలాగే అన్నెబోయినపల్లి యూపీ పాఠశాలలో 4 గదుల నిర్మాణాలకు రూ.48 లక్షలు మంజూరు కాగా రెండు గదుల బేస్‌మెంట్ల నిర్మాణాలకు రూ.8 లక్షలు ఖర్చు చేశారు. పెదపవని ఉర్దూ యూపీ పాఠశాలలో 5 గదుల నిర్మాణాలకు రూ.60 లక్షలు మంజూరు కాగా, రూ.20 లక్షలతో రెండు గదులు నిర్మించి, మిగిలిన 3 గదుల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. పెదపవని జడ్పీ హైస్కూల్‌లో 2 గదుల నిర్మాణాలకు రూ.24 లక్షలు మంజూరు కాగా, రెండు గదుల నిర్మాణాలకు రూ.20 లక్షలు ఖర్చు చేశారు. లింగసముద్రంలోని కేజీబీవీలో 8 తరగతి గదుల భవన నిర్మాణాలకు రూ.96 లక్షలు మంజూరు కాగా, సుమారు రూ.40 లక్షలు 4 గదుల నిర్మాణాలకు ఖర్చు చేశారు. మిగిలిన నాలుగు గదుల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణాల పూర్తికి నిధులు విడుదల చేయకపోవడంతో ఇవి అసంపూర్తిగా నిలిచి పోయాయి. అంతేకాక నాడు-నేడు ఫేస్-1 కింద కూడా నిర్మించిన, మరమ్మతులు చేపట్టిన పలు పాఠశాలల తరగతి గదులు, బాతురూంలకు రంగులు వేయకుండా వదిలివేశారు. ఈ విషమై అప్పటి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సాగర్‌ను వివరణ కోరగా మండలంలో నాడు-నేడు ఫేస్-2 కింద మంజూరైన తరగతి గదుల నిర్మాణ పనులకు పనులు చేసినంత వరకు 2024 మార్చిలో ప్రభుత్వం బిల్లులు విడుదల చేసింది. మిగిలిన భవనాల పనుల పూర్తికి నిధులు విడుదల కాక పోవడంతో పనులు నిలిచి పోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలి

బిట్రగుంట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బోగోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా అబ్దుల్ జహీర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై విచారణ చేపట్టాలని జిల్లా అధికారులను కోరినట్లు బోగోలు మాజీ ఉపసర్పంచు వీరరఘు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమాచార చట్టం కింద అడిగిన సమాచారంలో అనేక లొసుగులు ఉన్నాయ ని, దీనిపై ప్రజల సమక్షంలో విచారణ చేపట్టాలని కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యా దు చేసినట్లు తెలిపారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శం చేందుకు ఈనెల 3వ తేదీన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వస్తున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు ఎం.శ్రీనివాసులు. ఎకే.సుందర్ రాజు, పీ.అంకులయ్య, సురేంద్రరెడ్డి, ఎం. సాల్మన్ రాజు, కళ్యాణ్, టీ.రమణయ్య, నవాజ్, టీ.వెంకయ్య, రసూల్ పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రభాకర్‌ను కలిసిన టీడీపీ, బీజేపీ నేతలు

బిట్రగుంట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎన్.ప్రభాకర్‌ను సోమవారం టీడీపీ, బీజేపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు వీ.శ్రీనివాసులు, నేతలు కే.వెంకటేశ్వర రెడ్డి, ఏ.ఆదిశేషయ్య, పీ.సుబ్బారావు, ఎన్ఎస్ యాదవ్, జీ.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

కావలిటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్ కోరారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు డీఈ సాయిరాంను కలిసి కార్మికులు సమ్మెలో వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తురకా శీనయ్య, బీ రమేష్, ఎం బాలయ్య, కె బాబు, రమేష్, అలేఖ్య పాల్గొన్నారు.

160 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 423 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 263 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-144, ఆర్ఆర్-4, సీఆర్-7, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 160 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.215.29గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

3న ద్విచక్రవాహనం వేలం

కావలి రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో సీజ్ చేసిన హోండా గ్రాజియా ద్విచక్ర వాహనానికి ఈనెల 3వ తేదీన కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 10 శాతం ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

పేదలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం

● రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ

అల్లూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. మండలంలోని నార్తుమోపూరు సమీపంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌ను ఆయన సోమవారం సందర్శించారు. విద్య, వైద్యం, వృత్తి నైపుణ్యాలపై పేదలకు చేస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి-4 కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ధనికుల్లో ముందుండే పది మంది అట్టడుగున ఉన్న పేద కుటుంబాలకు బాసటగా నిలిచి వారిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఆయన మాటలను అనుసరిస్తూ నెల్లూరులోని వీఆర్ హైస్కూలును తాను అభివృద్ధి చేశానన్నారు. ఇదే స్ఫూర్తితో డీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి నెల్లూరు మూలాపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌ను అభివృద్ధి చేస్తామని ముందుకొచ్చారని, ఆయనకు ప్రభుత్వం తరఫున ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, స్థానిక నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, అడ్మిన్ మేనేజర్ అనిల్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నారాయణకు పూలమొక్క అందజేస్తున్న ట్రస్ట్ అధినేత సుధాకర్‌రెడ్డి, బీద గిరిధర్ తదితరులు

తండ్రి విగ్రహావిష్కరణకు తనయుడికి ఆహ్వానం

● రేపు కావలిలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహావిష్కరణ

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డులో ఏర్పాటు చేసి ఉన్న వంగవీటి మోహన్‌రంగా కాంస్య విగ్రహావిష్కరణ ఈనెల 2వ తేదీన జరుగుతోంది. ఈ విగ్రహావిష్కరణకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కాపునేతలు, రంగా అభిమానులతో కలిసి సోమవారం విజయవాడలో రంగా తనయుడు రాధాకృష్ణను కలిసి ఆహ్వానించారు. ఆయనను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు.



వంగవీటి రాధాకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి

ఇంటింటికి టీడీపీని విజయవంతం చేయండి

● నేతలతో ఎమ్మెల్యే ఇంటూరి సమీక్ష

కందుకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు తొలిఅడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను ప్రజలకు వివరించేం దుకు ఈనెల 2 నుంచి ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియచేయాలన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలియచేసి ఇంకేమైనా స్థానిక సమస్యలు ఉంటే గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేద్దామని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. తొలుత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

రూ.1.25 కోట్లతో అభివృద్ధి పనులు

కందుకూరు పట్టణాన్ని మోడల్ మున్సిపాలటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి పామూ రు రోడ్ సర్కిల్ వరకు రోడ్డుకు ఇరువైపులా రహదారి విస్తరణ, సెంట్రల్ డివైడర్ పనులకు రూ.125 కోట్లతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు. అలాగే జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలం ఎదురుగా రూ.50 లక్షలతో నిర్మించిన నూతన పార్కును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, డీఈ గణపతి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు, వలేటివారిపాలెం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, మదాల లక్ష్మీనరసింహం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సాంస్కృతిక పోటీల ప్రారంభం

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవాల సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలలో సాంస్కృతిక పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రెడ్‌క్రాస్ భవనంలో కావలి రెడ్‌క్రాస్ పోషకసభ్యులు కళాబంధు మన్నెమాల గోవిందరెడ్డి, ఎవేత్త డీవీ ఫణికుమార్, ప్రముఖ గాయకులు సూరిశెట్టి రామచంద్రరావు, టంగుటూరి జయశ్రీలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులలో రక్తదానంపై అవగాహన పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు పోటీలను నిర్వహించి ఆదివారం బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, పాలకమండలి సభ్యులు ఓరుగం టి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్న కుమార్, తలసేమియాడేకేర్ సెంటర్ సభ్యులు కల్లయ్య, జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు తోట వెంకటేశ్వర్లు, గాదిరెడ్డి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసిన రెడ్‌క్రాస్ బాధ్యులు

వ్యవసాయ రుణాలకు అధిక ప్రాధాన్యం

కలిగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు శాఖల్లో ఖాతాదారుల సౌకర్యార్థం పట్టణాల బ్యాంకులకు దీటుగా సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆబ్యాంక్ తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ మిత్తాన్తయ పేర్కొన్నారు. కలిగిరి కెనరాబ్యాంక్ శాఖ ఆధునీకరణ చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నెల్లూరు రీజియన్ ఏజీఎం అదారి నాగరాజు మాట్లాడుతూ కెనరాబ్యాంకు కలిగిరి శాఖ 12ఏళ్లల్లో రూ.100కోట్ల లావాదేవీల మైలురాయి దాటిందని పేర్కొన్నారు. తమ బ్యాంకు ద్వారా వ్యవసాయ, వ్యసాయేతర రుణాలేకాకుండా మహిళలకు, విద్యార్థులకు ప్రత్యేక రుణాలు అందిస్తున్నామన్నారు. అదేవిధంగా జీరో బ్యాలెన్స్‌తో ఖాతా నిర్వహించుకుంటూ బీమా సౌకర్యం కూడా పొందవచ్చని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ వెంగళరావు, భవన నిర్మాణ యజమాని సానా వెంకటేశ్వర్లు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న కెనరాబ్యాంకు అధికారులు

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు



బహుమతి అందుకున్న విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

జలదంకి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జలదంకి హైస్కూల్‌లో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగదు బహుమతులు అందించారు. అలాగే హైస్కూల్ ఉపాధ్యాయుడు వేలమూరి కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ చేయగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మద్దుల మాల్యాద్రి లక్ష్మీనరసింహ లక్ష్మీకాంతమ్మ మెమోరియల్ తరుపున 572 మార్కులు సాధించిన ద్రోణాదుల వైష్ణవికి రూ.15వేల, 552 మార్కులు సాధించిన మారుబోయిన లక్ష్మీప్రత్యూషకు రూ.10వేల, 549 మార్కులు సాధించిన ఎం.సింధుకు రూ.5వేల సంఘం గౌరవాధ్యక్షుడు మద్దుల వెంకటనరసింహం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోర్శిపాటి హరినారపరెడ్డి, ట్రెజరర్ సురే వెంకటశేషారెడ్డి, సభ్యులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న వెంగమాంబకు సారె

కొండాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మకు జరుగుతున్న సారె కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సమరసత ఫౌండేషన్ జిల్లా మహిళా సహ కన్వీనర్ మాలేపాటి స్రవంతి భక్తులను కోరారు. జూలై 17వ తేదీన జరిగే కార్యక్రమానికి సంబంధించిన వెంగమాంబ పేరంటాల ఆహ్వాన పత్రాలను సోమవారం మండలంలోని సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం గ్రామంలో ఫౌండేషన్ సభ్యులతో కలసి భక్తులకు ఆమె అందచేశారు. ఆమె వెంట ఫౌండేషన్ మండల సహ కన్వీనర్ సోమినేని రవీంద్రబాబు, భజన గురువు మన్నేపల్లి రమణయ్య, చల్లా వెంకటేశ్వర్లు, బొల్లినేని వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు

బిట్రగుంట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు నిర్వహిస్తుందని వైద్యులు ఎస్. రామకృష్ణ అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి ఆర్యోగ కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జక్కేపల్లి గూడూరు పంచాయతీ ఏబీ కండ్రికలో డాక్టర్ జీహారిక, విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో రామకృష్ణ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించి ఉచిత వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం సిబ్బందితో పాటు 104, ఆశా వర్కలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ

కావలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు సోమవారం డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన కాలనీలలోని పిల్లలు బడిలో ఉండాలని ఎక్కడా పనులలో ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏటూరు రామిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ డీ.మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ శారద పాల్గొన్నారు.



విద్యా సామగ్రి అందజేస్తున్న దాతలు

యానాది కాలనీల్లో పాఠశాలలను ఎత్తివేయవద్దు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): యానాదికాలనీల్లో ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయవద్దని దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నాయకులు, మహిళలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడుతూ బోగోలు మండలం కొండ బిట్రగుంట యానాదికాలనీలో 46 మంది యానాది విద్యారులున్న పాఠశాలను పక్క గ్రామంలోని పాఠశాలలో కలిపి వేశారన్నారు. ఇది దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. యానాది కాలనీల్లో ఉన్న పాఠశాలలను అక్కడే ఉంచి ప్రాథమిక విద్యను అందిచాలని కోరారు. 80 శాతం మంది పిల్లలకు తల్లికి వందనం రాలేదన్నారు. ఈ ధర్నాలో కొండబిట్రగుంటకు చెందిన మహిళలతోపాటు, నాయకులు ఎస్. లక్ష్మయ్య, అశోక్, రాచగిరి మురళి, పీ.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

లింగసముద్రం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పాఠశాల విద్య-ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్‌పై ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అందరూ ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను చేర్పించాలన్నారు. ఎంఈవో-2 శివకుమార్ మాట్లాడుతూ బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించి డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. తల్లిదండ్రులకు పాఠశాల విద్య యొక్క ప్రాధాన్యత గురించి వివరించాలన్నారు.. త్వరలో ప్రభు త్వం నిర్వహించే మెగా పేరెంట్ సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వృద్ధురాలి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

కావలి రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేరళ ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్తూ 60 ఏళ్ల వృద్ధురాలు నిషాద్ రామ్‌దులారి తప్పిపోయిందని సోమవారం 1వ పట్టణ సీఐ ఫిరోజ్‌కు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హమీర్‌పూర్ జిల్లా పడోరి గ్రామానికి చెందిన రామ్‌దులారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. తామంతా కేరళ ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతికి వెళుతుండగా మే 19వ తేదీన నెల్లూరులో తప్పిపోయిందని, దీంతో ఆమె కోసం అప్పటి నుంచి వెతుకుతున్నామని ఆమె కుమారుడు దీపక్ పేర్కొన్నారు. ఈ మేరకు గోడపత్రులు కూడా అంటించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

మంగళవారం 1 జూలై 2025



లగేజీ స్కానర్లు పనిచేయకపోవడంతో మాన్యువల్‌గా తనిఖీ - లగేజీ తనిఖీల కోసం భక్తుల నిరీక్షణ

అలిపిరిలోనే దేవుడు కనిపించాడు

తిరుమలకు వెళ్లే భక్తుల లగేజీకి అలిపిరి చెక్‌పాయింట్‌లో తనిఖీ తప్పనిసరి. సోమవారం ఉదయం 6.55 గంటలకు ఆరు స్కానర్లూ పనిచేయలేదు. విద్యుత్తు సరఫరా ఆగడం.. సర్వర్లు పనిచేయకపోవడం కారణమని చెబుతున్నారు. దీంతో భక్తులు తమ లగేజీ తనిఖీ చేయించుకోవడానికి ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు ఏవీఎస్వో రమేష్, విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం రంగంలోకి దిగి అదనపు సిబ్బందితో లగేజీ బ్యాగులను తనిఖీ చేయించారు. దీంతో ఆలస్యం కావడంతో వాహనాలు బారులు తీరాయి. 9.30 గంటల వరకు ఇదే పరిస్థితి. తనిఖీల కోసం ఎక్కువ సమయం నిరీక్షించాల్సి రావడంతో భక్తులు అసహనానికి గురై సిబ్బంది ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ తర్వాత లగేజీ స్కానర్లు పనిచేయడంతో యథావిధిగా తనిఖీలు జరిగాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

నమ్మకమే సగం వైద్యం

నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



తిరుపతి(వైద్యం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దేవుడు జన్మనిస్తే డాక్టరు పునర్జన్మనిస్తాడని అంటారు. అందుకే 'వైద్యోనారాయణో హరి' అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ దిశగా తమపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా వైద్యులు కృషి చేయాల్సి ఉంటుంది. ఇక డాక్టరుపై రోగికి నమ్మకం ఉంటే.. సగం జబ్బు నయమైనట్లే. అదే విధంగా రోగి కూడా వైద్యులపై నమ్మకం పెట్టుకోవాలి. ఇద్దరి మధ్య విశ్వాసం ఉంటేనే.. ఆరోగ్యకర వాతావరణం సాధ్యమవుతుంది. ఇటువంటి అద్వితీయ అనుబంధాన్ని బలోపేతం చేసుకునేందుకు వైద్యుల దినోత్సవం కన్నా మంచి తరుణం దొరకదు. జీవితకాలం దేశీయ వైద్యరంగంలో మౌళిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన భారతరత్న పురస్కార గ్రహీత డాక్టర్ బీసీరాయ్ స్మారకార్థం 1991 నుంచి ఏటా జూలై ఒకటో తేదీన జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆయన్ను గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించడమే కాకుండా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ తమ వైద్యపరమైన నైపుణ్యాలతో రోగుల ప్రాణాలను నిలబెట్టేలా నిస్వార్థమైన సేవలను అందించే డాక్టర్లను ఎప్పటికీ దేవుళ్లుగానే చూస్తారు.

రోగుల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా..



ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారిలో ఎక్కువగా నిరుపేదలే ఉంటారు. ఇక్కడి డాక్టర్లపై ఉన్న నమ్మకంతోనే వస్తారు. అటువంటి వారి ఆరోగ్య భద్రతే లక్ష్యంగా వైద్యసేవలు అందిస్తున్నాం. రోగులకు వైద్యంతోపాటు వారిలో మానసిక ధృఢత్వాన్నీ పెంపొందించేలా వారితో మాట్లాడాలని ఆస్పత్రిలోని డాక్టర్లకు నిత్యం చెబుతున్నాం. అదే తరహాలో రోగులతో డాక్టర్లు మలుచుకుంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యవృత్తిలో రాణించే అవకాశం నాకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. నా వంతుగా నిత్యం రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి నమ్మకాన్ని నిలబెట్టేలా కృషి చేస్తా. అదే విషయాన్ని నాతోటి డాక్టర్లకు చెబుతుంటా.

- డాక్టర్ రాధ, రుయాస్పత్రి సూపరింటెండెంట్

ప్రభుత్వాస్పత్రుల్లో నిస్వార్థంగా వైద్యసేవలు



ఇతరుల ప్రాణాలను కాపాడగలిగే గొప్ప అవకాశం ఒక్క డాక్టర్లకే ఉంటుంది. అటువంటి వృత్తిలో రాణించడమనేది గత జన్మ పుణ్యఫలంలా భావించాలి. ఈ వృత్తిని వ్యాపారంగా చూడకూడదు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం రోగులకు నిస్వార్థ సేవలు అందించాలనే ఆలోచనతో వచ్చే వారికంటే వైద్య వ్యాపారం బాగుంటుందని ఈ వృత్తిలో అడుగు పెట్టే వారే ఎక్కువ. అందువల్లే ప్రజలకు వైద్యులపై నమ్మకం సన్నగిల్లుతోంది. కానీ నిస్వార్థంగా వైద్యసేవలు అందించే వాళ్లూ ఉన్నారనే విషయాన్ని ప్రజలు కూడా విశ్వసించాలి. కార్పొరేట్ ఆస్పత్రుల విషయం పక్కన పెడితే ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్లు మాత్రం నూరు శాతం ప్రజల ఆరోగ్య భద్రత కోసమే కృషి చేస్తున్నారనేది సత్యం.

- డాక్టర్ బాలకృష్ణనాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి



వైద్యవృత్తిలో అడుగు పెట్టే విద్యార్థులు ప్రజల ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా రాణించాలి. అందుకనే వైద్య విద్యార్థులకు కేవలం వైద్యపరంగానే కాకుండా వైద్యుల నైతిక విలువలు, సమాజంలో వైద్యుల పాత్ర వంటి విషయాలపై ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రముఖలతో అతిథి ఉపన్యాసాలు కొనసాగిస్తున్నాం. వైద్య వృత్తి అనేదే దేవుడు మనకు ఇచ్చిన ఒక వరం. అటువంటి వైద్యులను తీర్చిదిద్దే అవకాశం కల్పించడం నిజంగా నా గత జన్మ సుకృతం. నాకు కల్పించిన ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవడంతోపాటు నైతిక విలువలు కలిగిన వైద్యులను సమాజానికి అందించేందుకు కృషి చేస్తాను.

- డాక్టర్ రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్



రాయుడు మిలటరీ హోటల్‌లో వేసిన నమూనా ఆలయ సెట్టింగ్



అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న కిరణ్ రాయల్

రాయుడు మిలటరీ హోటల్‌లో శ్రీవారి గర్భాలయ నమూనా సెట్

- మాంసాహారం విక్రయిస్తున్న హోటల్‌పై చర్యలు తీసుకోండి
- టీటీడీ అదనపు ఈవోకు కిరణ్‌రాయల్ ఫిర్యాదు

తిరుమల, జూన్30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి గర్భాలయ తరహాలో నమూనా ఆలయ సెట్టింగు వేసి నాన్‌వెజ్ విక్రయిస్తున్న రాయుడు మిలటరీ హోటల్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి జనసేన నేత కిరణ్‌రాయల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వినతిపత్రాన్ని అందజేశారు. తిరుమల శ్రీవారి ప్రతిష్ఠను వ్యాపారాలకు వాడుకుంటున్న వారిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజమండ్రి నుంచి వైజాగ్‌కు వెళ్లే హైవేలో రాయుడు మిలటరీ హోటల్‌లో శ్రీవారి గర్భాలయ నమూనా సెట్టింగ్ వేశారన్నారు. అందులో జయ విజయలతో పాటు శ్రీవారి విగ్రహాన్నీ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. 'తిరుమల అన్నప్రసాదం తరహాలోనే మేమూ పెడుతున్నాం అని ఆ హోటల్ నిర్వాహకుడు అంటున్నాడు. ఓరెయ్ వెదవ. మేము నాన్‌వెజ్ పెడుతున్నామా? ప్యూర్ వెజిటేరియన్ పెడుతున్నాం. వేంకటేశ్వర స్వామి భక్తులంటే ఎలా కనిపిస్తున్నారు నీకు' అంటూ ఆ హోటల్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ హోటల్‌లో నాన్‌వెజ్ వాసన వస్తుంటే.. మరోవైపు నమూనా సెట్టింగులో శ్రీవారి విగ్రహానికి హారతి ఇస్తున్నారంటూ ఆవేదనతో అమెరికా, జర్మనీ దేశాల్లోని భక్తుల నుంచీ తమకు వీడియోల సహా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. 24 నుంచి 48 గంటల్లోపు ఆలయ నమూనాను తొలగించకుంటే శ్రీవారి భక్తులు దాడి చేస్తారని హెచ్చరించారు. టీటీడీలో ప్రత్యేకంగా ఓ వింగ్‌ను ఏర్పాటు చేసి సోషల్ మీడియాపై నిఘా ఉంచాలని కోరారు. ఫుడ్ కార్పొరేషన్ అధికారులతోనూ టీటీడీ అధికారులు మాట్లాడారని, రాయుడు మిలటరీ హోటల్ లైసెన్స్‌ను రద్దు చేయిస్తామన్నారు.

డీసీసీబీ, సీడీసీఎంఎస్ చైర్మన్ల పదవీకాలం పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకారకేంద్ర బ్యాంకు చైర్మన్ డీసీసీబీ) అమాస రాజశేఖర్‌రెడ్డి, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ (డీసీఎంఎస్) పి. సుబ్రహ్మణ్యం నాయుడు పదవీకాలాన్ని ఆరునెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతనెల 26వ నుంచి నెలకు మాత్రమే అవకాశం కల్పించిన ప్రభుత్వం ఈనెల 27 నుండి డిసెంబరు 26 వరకు పదవీకాలాన్ని పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

నేడు 2,59,732 మందికి పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు జులై నెలకు సంబంధించి మంగళవారం సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 2,59,732 మందికి గాను ప్రభుత్వం రూ.111.45కోట్లు కేటాయించింది. ఉదయం 6 గంటలకు 691 సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

రైళ్లలో చోరీలు, దోపిడీలు అరికట్టండి

రైల్వే పోలీసులకు డీఐజీ సత్యఏసుబాబు ఆదేశం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో రైళ్లలో దొంగతనాలు, దోపిడీల నివారణకు కలిసికట్టుగా పనిచేయాలని విజయవాడ రైల్వే డీఐజీ సత్యఏసుబాబు ఆదేశించారు. రైళ్ల దొంగతనాలు, సిగ్నల్ ట్యాంపరింగ్‌లపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడ నుంచి తిరుపతి రైల్వే అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. నేరాల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? బ్యాగ్ లిఫ్టర్లు, మొబైల్ దొంగలు ఎంతమందిపై కేసులు పెట్టారు? రోజూ ఎంతమంది గస్తీ చేస్తున్నారనే వివరాలు తెలుసుకున్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో నిఘా పటిష్ఠం చేయాలని ఆదేశించారు. రాత్రి బీట్లు గట్టిగా చేస్తే దొంగలకు భయం కలుగుతుందన్నారు. ఎక్కడ దొంగతనాలు, దోపిడీలు జరిగినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో నేరాల కట్టడి, బ్యాగ్ లిఫ్టర్లు, మొబైల్ దొంగతనాల నివారణకు తీసుకున్న చర్యలపై సీఐ ఆశీర్వాదం వివరించారు.

650 మంది వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్

తిరుపతి(వైద్యం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన డాక్టర్ల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కార్యక్రమంలో భాగంగా 650 మంది వైద్యులు రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఎన్వోసీలు నమోదు చేసుకున్నట్లు ఏపీ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే తరహాలో మళ్లీ ఆరు నెలల తరువాత ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. వైద్యులు ఎప్పటికప్పుడు వారి ధ్రువపత్రాలను రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవాలని ఆయన వివరించారు.



కలెక్టర్‌ను ఆశీర్వదిస్తున్న సాధువులు

సగం సమస్యలు రెవెన్యూవే

తిరుపతి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్యల్లో సగం రెవెన్యూ శాఖవే. మొత్తం 296 వినతులకు గాను 145 ఆ శాఖకు సంబంధించినవే. ప్రతి వారం ఇదే పరిస్థితి. కాగా, అర్జీల స్వీకరణ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు సాధువులు అక్కడికి వచ్చి కలెక్టర్‌ను ఆశీర్వదించారు. అక్కడి వారికి రుద్రాక్షలు పంచారు.

- 6లో



ఈ బైక్ షోరూమ్‌లో అగ్నిప్రమాదం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం రేణిగుంట రోడ్డులోని జాయ్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన షోరూములో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్ళి మంటలను అదుపు చేశారు. అప్పటికే షోరూములోని ఫర్నిచర్, 10 ఈ- బైక్‌లు కాలిపోయాయి. ఈ ఘటనలో దాదాపు రూ 20.లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక సహాయ సంచాలకుడు కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

ఈ-సిమ్ పేరుతో టోకరా

- రూ.1.90 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఓ మహిళ ఖాతాలో నుంచి రూ.1.90 లక్షలు కాజేశారు. తడ మండల పరిధిలోని పెరియవట్టు గ్రామానికి చెందిన ఈదూరు శ్రీదేవికి స్థానిక కెనరా బ్యాంక్‌లో ఖాతా ఉంది. పది నెలల క్రితం పొదుపు సంఘం ద్వారా రూ.2 లక్షల రుణం తీసుకుంది. ఇంటి నిర్మాణానికి ఖర్చు చేద్దామన్న ఉద్దేశంతో ఆ డబ్బును ఖాతాలోనే ఉంచింది. బ్యాంక్ ఖాతాకు ఆమె కుమారుడు లోకనాథం ఫోన్ నెంబరును జత చేసింది. ఇదిలా ఉండగా గత శనివారం లోకనాథం ఫోన్‌కు ఈ-సిమ్ కావాలంటే తమను సంప్రదించాలంటూ ఎస్ఎంఎస్ ద్వారా ఈ లింక్ వచ్చింది. లోకనాథం ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో కొద్ది నిమిషాల తరువాత ఫోన్ హ్యాంగ్ అయింది. వెంటనే ఓటీపీ వచ్చింది. ఆ ఓటీపీ సెండ్ చేస్తే మీ ఫోన్ సాధారణ స్థితికి వస్తుందంటూ మరో మెసేజ్ రావడంతో లోకనాథం ఆ ఓటీపీని అలాగే ఫార్వార్డ్ చేశాడు. అప్పటి నుంచి ఆదివారం వరకు అతని ఫోన్ పనిచేయలేదు. సోమవారం బ్యాంక్ ఖాతా నుంచి రూ.25వేలు నగదు డ్రా చేసినట్లుగా మెసేజ్ రావడంతో లోకనాథం ఖంగుతిన్నాడు. వెంటనే తల్లిని తీసుకొని బ్యాంక్‌కు వెళ్లి విచారించగా తన ఖాతాలో ఉండాల్సిన రూ.1.90 లక్షలు మరో అకౌంట్‌లోకి వెళ్లిపోయినట్లు బ్యాంక్ అధికారులు చెప్పారు. దీంతో లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వేయర్ల బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం

సీనియారిటీ జాబితాలో మార్పుపై నిరసన ● రెండు గంటలపాటు నిలిచిన ప్రక్రియ



సర్వేయర్ల బదిలీ ప్రక్రియలో వాగ్వాదం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల సర్వేయర్లకు ఆది, సోమవారాల్లో బదిలీలు జరిగాయి. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని 520 మందికి గాను 398 మందికి బదిలీల కౌన్సెలింగ్ పూర్తయ్యింది. కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో జరిగిన కౌన్సెలింగ్‌కు మూడు జిల్లాల అధికారులు, హాజరయ్యారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని బదిలీ చేశారు. సొంత మండలాలు కాకుండా పక్కనే ఉన్న మండలానికి పంపించారు. ర్యాంకుల ఆధారంగా ఈప్రక్రియ జరగ్గా, అధికారుల తప్పిదాల వల్ల తిరుపతి జిల్లాకు బదిలీ కావాల్సినవారు చిత్తూరు జిల్లాకు, చిత్తూరు జిల్లాకు బదిలీ కావల్సిన వారు తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యామంటూ ఆరోపించారు. సోమవారం గందరగోళం మధ్య కౌన్సెలింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. పలుసార్లు సీనియారిటీ జాబితాలో మార్పులు చోటుచేసుకున్నాయి. దాంతో సర్వేయర్లకు తెలియకుండా, జాబితా ప్రచురించకుండానే జరిగిన కౌన్సెలింగ్‌లో కొందరు తమకు అనుకూలమైన సర్వేయర్లకు స్థానాలు కేటాయించేందులో అధికారులు అడ్డదారులు తొక్కారంటూ పలువురు అడ్డుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా కొందరు నినాదాలు చేశారు. ఫలితంగా మధ్యాహ్నం రెండు గంటలపాటు కౌన్సెలింగ్ ఆగిపోయింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను పునఃప్రారంభించి 5 గంటలకు ముగించారు. కౌన్సెలింగ్‌లో చిత్తూరు జిల్లా సర్వేశాఖ ఏడీ జయరాజ్, అన్నమయ్య జిల్లా ఏడీ భరత్‌కుమార్, సూపరింటెండెంట్ రాజేంద్ర, తిరుపతి జిల్లా సూపరింటెండెంట్ చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

'హరిహర వీరమల్లు'లో పాట పాడా



తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రంలో 'కొల్లగొట్టి నాదిరో' అనే ఓ పాట పాడానని గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన తల్లి, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సినిమా పాటలతో పాటు దేవుడి పాటలూ పాడుతున్నట్టు ఓ ప్రశ్నకు బదులిచ్చారు. అలాగే, సినీహీరో మాధవన్, నటి వాసుకి, మహారాష్ట్ర మంత్రి ప్రకాష్ అంబేద్కర్ తదితరులూ శ్రీవారిని దర్శించుకున్నారు.



రాహుల్ సిప్లిగంజ్ - మాధవన్



వాసుకి

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.34 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 88,497

తలనీలాలు సమర్పించినవారు: 29,054





నాసిరకం యంత్రాలు కొన్న వారిపై కేసు పెట్టాలి

టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ డిమాండ్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆయుర్వేద ఆస్పత్రి కోసం ట్యాబ్లెట్ మందులను తయారు చేసేందుకు గత పాలకవర్గంలో మూడు నాసిరకం మిషన్లను కొన్నారని ప్రస్తుత ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనలో బాధ్యులపై కేసు నమోదు చేయాలన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భక్తుల సొమ్మును గత వైసీపీ పాలకులు నాసిరక మిషన్ల పాలు చేశారని విమర్శించారు. అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హయాంలో ఆయుర్వేద ఆస్పత్రి కోసం ట్యాబ్లెట్ మందులను తయారు చేసే మూడు మిషన్లను రూ.4కోట్లకు కొన్నారన్నారు. ఆయుష్ శాఖకు పంపించి తద్వారా ఆదాయం వస్తుందని చెప్పి వీటిని కొనుగోలు చేశారన్నారు. ఆ మూడు మిషన్లలో ఒకటి కాలిపోగా. మరో దానిలో మందుల పొడి బయటకు వస్తుందన్నారు. ఇంకోదానికి బోల్టులు ఊడిపోతున్నాయన్నారు. తమ పరిశీలనలో ఆ మిషన్లు సెకండ్‌హ్యాండ్‌విగా గుర్తించామన్నారు. ఈ మిషన్లను హైదరాబాద్‌కు చెందిన సాయితేజ స్టీల్‌కార్పొరేషన్ సప్లై చేసినట్లు తెలిసిందన్నారు. దీనిని ఓ చిన్న రేకుల షెడ్‌లో నడుపుతున్నారన్నారు. భక్తుల సొమ్ము రూ.4కోట్లను వృథా చేసి నాసిరకం మిషన్లు కొన్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటేశ్వరస్వామి సొత్తు తిన్నందుకే 11 సీట్లు ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ వాయిదా

చిత్తూరు సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్ల బదిలీల కౌన్సిలింగ్ వాయిదా పడింది. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవన్‌లో సోమవారం చిత్తూరు పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి ఈఈ రామ్‌మోహన్, మదనపల్లె ఈఈ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో కౌన్సెలింగ్ జరిగింది.ఉమ్మడి జిల్లాలో 664 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదివారం, సోమవారం 449 మందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో మిగిలిన ఉద్యోగుల బదిలీలను వాయిదా వేశారు. సీఎం పర్యటన అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

పాఠశాలను విలీనం చేయొద్దు



శ్రీకాళహస్తి మండలం యార్లపూడి పంచాయతీ రాజుగుంటహరిజనవాడలోని పాఠశాలను విలీనం చేయవద్దని గ్రామస్తులు కోరారు. 50 సంవత్సరాలుగా గ్రామంలో ఉన్న పాఠశాలను మన్నవరం స్కూల్లో విలీనం చేశామని, పిల్లలను అక్కడికి పంపాలని చెప్పడం బాధాకరమన్నారు. తమ గ్రామంలో పాఠశాలను కొనసాగించాలని గ్రామస్తులు వజ్రమ్మ, సావిత్రమ్మ, సుబ్రహ్మణ్యం, నాగరాజు, జయచంద్ర కోరారు.

సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆందోళన ● పీజీఆర్ఎస్‌కు 296 వినతులు ● అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ప్రజలు, ప్రజా సంఘాలు, విశ్రాంత ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. 296 వినతులు అందగా 145 రెవెన్యూ సంబంధితమైనవే ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొంతమంది సాధువులు వచ్చి అధికారులను ఆశీర్వదించి వెళ్లారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఫైనాన్స్ బిల్లులో లోపాలను సవరించండి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫైనాన్స్ బిల్లులో లోపాలని సవరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కేఆర్ శంకర్, సహాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ ఈ బిల్లులో భవిష్యత్తులో పెన్షనర్ల బేసిక్ పే పెంపుదల ఉండదని చెప్పడం బాధాకరమన్నారు. దీనిపై ఆందోళనలు చేస్తుండగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కంటితుడుపు ప్రకటనలు చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. పే రివిజన్ చేసినపుడు విశ్రాంత ఉద్యోగులకు బేసిక్ పే పెంపుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సర కాలంగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలూ కల్పించలేదని తెలిపారు. పెండింగ్ డీఏలను ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధయ్య, పాపయ్య, మునికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్‌గైడ్స్ సమస్యలు పరిష్కరించండి

టూరిజం శాఖలో పనిచేస్తున్న లోకల్ గైడ్స్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 1996లో టూరిజం ప్యాకేజీల్లో భాగంగా తిరుమలలో ప్రత్యేక దర్శనాలు కల్పించారని తెలిపారు. తద్వారా లోకల్ గైడ్లకు జీవనోపాధి దొరికిందన్నారు. అయితే కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడ్డారనే నెపంతో గత ప్రభుత్వం టూరిజం కార్పొరేషన్లకు ఉన్న ప్రత్యేక దర్శనాలను రద్దు చేసిందని చెప్పారు. తద్వారా తిరుపతిలో ఉన్న సుమారు వందమంది లోకల్‌గైడ్స్ కుటుంబాలు వీధిన పడ్డాయని తెలిపారు. వెంటనే వారికి జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి గైడ్ యూనియన్ నాయకులు పెదిరెడ్డి, చంద్రమౌళి, నాగభూషణం, సురేష్, వెంకటేష్, శివ, ఏకాంత, శ్రీకాంత్, రాము, హరి పాల్గొన్నారు.

రజకుల స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

రజకుల స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ పరిధిలోని పేరూరు పంచాయతీ యాదవ్‌కాలనీలో ఉండే రజకుల స్థలాన్ని పంచాయతీ అధికారి ఆక్రమించి కంచె వేయడం దుర్మార్గమన్నారు. 2014లో ప్రభుత్వం రజకులకు 50 సెంట్లు కేటాయించిందన్నారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వమే తొట్టెలు, బోర్లు వేయించనట్లు చెప్పారు. ఆ స్థలం చుట్టూ కంచె వేయడం దుర్మార్గమని, వెంటనే దాన్ని తొలగించాలని కోరారు. జిల్లా నాయకులు చిన్నబాబు, పుల్లయ్య, శివయ్య, సురేంద్ర, మునెప్ప, చంద్రశేఖర్, చంద్రబాబు, కోమల, కుసుమ, భూదేవి పాల్గొన్నారు.

తప్పుడు ఎండార్స్‌మెంట్లు ఇచ్చారు

రెవెన్యూ సమస్యలు పరిష్కారమైనట్లు తప్పు డు ఎండార్స్‌మెంట్ ఇస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ గత డిసెంబరులో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 15,264 మంది తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారని, అందులో ఎక్కువ భాగం పరిష్కారం కాకనే అయినట్లు అధికారులు ఎండార్స్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. ఇలాంటి తప్పుడు నివేదికలపై విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్కింగ్ స్థలాన్ని కాపాడండి

నాయుడుపేటలో మినీ ట్రక్ వ్యాన్‌లకు సంబంధించిన పార్కింగ్ స్థలాన్ని కాపాడాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు జయచంద్ర, శివ, ముకుంద మాట్లాడుతూ నాయుడుపేట పంచాయతీగా ఉన్న సమయంలో ఆర్టీసీ బస్టాండుకు ఎదురుగా ఉన్న స్థలంలో ట్యాక్సీలు ఆపుకునేవారన్నారు. కాంప్లెక్స్ కట్టాలని ఖాళీ చేయమనడంతో పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ శాఖకు చెందిన ఖాళీ స్థలంలో స్టాండ్ పెట్టుకున్నారన్నారు. 2019లో అన్న క్యాంటీన్ ఏర్పాటు పేరుతో దాన్ని ఖాళీ చేయించి అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న స్థలంలో పెట్టుకోవాలని సూచించారన్నారు. ఇప్పుడు ఉన్నఫలంగా ఖాళీ చేయమని మున్సిపల్ కమిషనర్ చెప్పడం బాధాకరమన్నారు. ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. గిరి, మస్తాన్‌రెడ్డి, హేమంత్, రమణయ్య, అమీర్, చెంచుకుప్పయ్య, జిలానీ, సతీష్ పాల్గొన్నారు.



జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం అందించే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు జులై 13వ తేదీ లోపు ఆన్‌లైన్ పోర్టల్ nationalawardstoteachers.education.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పోర్టల్‌ను పరిశీలించాలని తెలిపారు.

నేడు దిశ సమావేశం

నెల్లూరు(జడ్పీ), జూన్30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని జిల్లాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న 68 పథకాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు, జిల్లాస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.



సోమశిలలో నేటి నుంచి
చేపల వేట నిషేధం

అనంతసాగరం జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో మంగళవారం నుంచి మూడు నెలలపాటు చేపల వేట నిషేధించారు. ఈ మూడు మాసాలు చేప గుడ్డదశలో ఉంటుంది. దీంతో చేపల ఉత్పత్తి పెంచేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. అయితే కొందరు వ్యాపారులు, జాలర్లు బయట వారిని పిలిపించి అక్రమ వేటకు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ప్రాజెక్టు లోతట్టులోని జనసంచారం లేని ప్రాంతాల నుంచి చేపలవేట సాగించి వెనుకవైపు కడప జిల్లా గోపవరం మండలం వద్ద అటవీ ప్రాంతం నుంచి గుట్టుగా తరలించేలా కార్యాచరణ చేసినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే రాబోవు రోజుల్లో చేపల వేటపై జీవనం సాగించే మత్స్యకారుల జీవనప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. నిషేధాన్ని పక్కాగా అమలు పరచి కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. కా గా, ఇటీవల మత్స్యశాఖ అధికారులు సోమశిలలో జాలర్లతో సమావేశమై నిషేధ సమయంలో చేపలవేట సాగించవద్దని గట్టిగా హెచ్చరికలు జారీ చే శారు. ఈ మేరకు వ్యాపారులను పిలిపించి నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు ఉంటాయని సూచించారు.

● డ్యాంలో నీటి నిల్వ

సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 227 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నీటినిల్వ 33.128 టీఎంసీలుగా నమోదై ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 850, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలు

నెల్లూరు(క్రైం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. ఎస్పీ కృష్ణకాంత్ బదిలీల పక్రియను పర్యవేక్షించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి, నిబంధనలు అనుసరించి ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఇరిగేషన్ అధికారుల మెడకు 'సర్వేపల్లి' కేసు

● ముగ్గురిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఆదేశం

నెల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో చేసిన పాపాలు ఇరిగేషన్ అధికారులను కూడా వెంటాడుతున్నాయి. నాడు అధికార దర్పంతో వైసీపీ నాయకులు విచ్చలవిడి దోపిడీకి పాల్పడగా, వారిని అడ్డుకోవడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమయ్యారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో జరిగిన గ్రావెల్ దోపిడీనే ఇందుకు నిదర్శనం. ఏకంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరుతో ఫోర్జరీ సంతకాలతో గ్రావెల్ తవ్వకాలకు దరఖాస్తు చేసుకోగా ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇచ్చేశారు. ఇలా రూ.కోట్ల మట్టి, గ్రావెల్‌ను కొల్లగొట్టారు. ఈ అక్రమ వ్యవహారంపై ఇటీవల ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది. నాడు వెంకటాచలంలో నమోదైన కేసును బాపట్ల డీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటైన సిట్‌కు బదిలీ చేశారు. ఈ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆయన అనుచరుడు నిరంజన్‌రెడ్డిలతో మరికొంత మంది నిందితులుగా ఉన్నారు. వీరిద్దరినీ ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం దర్యాప్తు వేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే శాఖాపరమైన చర్యలకు ఇరిగేషన్ శాఖ పూనుకుంది. అప్పట్లో పనిచేసిన అధికారులను బాధ్యులను చేస్తూ చర్యలకు ఉపక్రమించింది. సర్వేపల్లి రిజర్వాయర్‌లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగిందని వాస్తవమని తేల్చిన ఈఎన్‌సీ, ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో ప్రభుత్వానికి రెండు నివేదికలు అందజేశారు. ఆ నివేదికల ఆధారంగా అప్పటి సెంట్రల్ డివిజన్ ఈఈ కృష్ణమోహన్, నెల్లూరు డీఈఈ పెంచలయ్య, బ్రహ్మదేవి సెక్షన్ ఏఈ ప్రసాద్‌లపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల క్రమశిక్షణ నిబంధనల ప్రకారం ఈ ముగ్గురు అధికారులకు మేజర్ పెనాల్టీ విధించే విధంగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేజర్ పెనాల్టీ ఏ స్థాయిలో ఉంటుందన్నది తెలియాల్సి ఉంది. ఈ వ్యవహారం ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఎలక్ట్రిక్ బస్సులు
రయ్.. రయ్!

● నెల్లూరు 2వ డిపోకు 100 కేటాయింపు ● 12 మీటర్ల పొడవైనవి 64, 9 మీటర్లవి 36

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీలో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు రయ్.. రయ్‌మంటూ రోడ్లపై తిరగనున్నాయి. ఇప్పటికే నెల్లూరు-తిరుపతి మధ్య నడుస్తున్న బస్సులకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో నెల్లూరు రీజియన్ నెల్లూరు రెండవ డిపోకు కేంద్ర ప్రభుత్వం 100 ఎలక్ట్రికల్ హాయిర్ బస్సులను కేటాయించింది. ఈ బస్సులు అతి త్వరలోనే రీజియన్‌కు చేరనున్నాయి.



● 12 మీటర్ల పొడవైన బస్సులు

నెల్లూరు రీజియన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బస్సుల్లో 12 మీటర్ల పొడవైన బస్సులు 64, 9 మీటర్ల చిన్న బస్సులు 36 ఉన్నాయి. ప్రస్తుతం నెల్లూరు-తిరుపతి మధ్య తిరుగుతున్న ఎలక్ట్రికల్ బస్సులు 9 మీటర్ల పొడవు ఉన్నాయి. కేంద్రం నుంచి రానున్న 12 మీటర్ల పొడవైన బస్సులను ఆర్టీసీ అధికారులు చెన్నై, విజయవాడ, తిరుపతి నగరాలకు నడిపేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

● చార్జింగ్ పాయింట్ల పరిశీలన

నెల్లూరు రెండవ డిపో గ్యారేజ్‌లో ఇప్పటికే తిరుపతి డిపోకు చెందిన విద్యుత్ బస్సుల కోసం చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి ఉన్నారు. కొత్తగా వచ్చే ఎలక్ట్రికల్ బస్సుల కోసం రెండవ డిపో గ్యారేజ్‌లోనే చార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారుల గ్యారేజీలో ఎక్కడ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలి, ఎంత విద్యుత్ వాటికి అందించాలి అన్న అంశాలపై పరిశీలించారు. ఈ క్రమంలో కొద్ది రోజుల్లోనే చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు పూర్తి కానుంది. ఇక బస్సులు వచ్చిన వెంటనే రోడ్లపై ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు పరుగులు తీయనున్నాయి.

పచ్చని కాపురంలో
అనుమానం చిచ్చు!

● మద్యం మత్తులో కత్తితో వీరంగం ● దుత్తలూరు మండలంలో దారుణం

● తొలుత భార్యపై దాడి ● అడ్డొచ్చిన అత్తామామలపై కత్తివేటు.. అక్కడికక్కడే మృతి

● భార్యకూ తీవ్రగాయాలు ● పరారీలో నిందితుడు



మృతులు జయమ్మ, కల్లయ్య (ఫైల్)



అనుమానం పెనుభూతమైంది. మద్యానికి బానిసను చేసింది. పచ్చని సంసారంలో చిచ్చుపెట్టి ఇద్దరి మృతికి కారణమైంది. నిండునూరేళ్లు తోడినీడగా ఉంటానన్న భర్తే ఆ కుటుంబం పాలిట యమకింకరుడిగా మారాడు. మద్యం మత్తులో భార్యపై, అడ్డొచ్చిన అత్తామామలపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో వృద్ధ దంపతులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కొనఊపిరితో ఇల్లాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దుత్తలూరు మండలం కమ్మవారిపాలెం గ్రామ సమీపంలోని ఏసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆనం చెంచుసుబ్బారెడ్డి (ఏసీ) కాలనీకి చెందిన ఏలూరి వెంగయ్యకు వెంకాయమ్మతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి శ్రావ్య, మనోహర్, శ్రీవల్లి అనే ముగ్గురు సంతానం. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ పిల్లల్ని చదివించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గత కొన్నినెలలుగా వెంగయ్య తన భార్యపై అనుమానం వ్యక్తం చేస్తూ మద్యానికి బానిసై తరచూ వివాదానికి దిగేవాడు. ఆదివారం రాత్రి వెంగయ్య పూటుగా మద్యం సేవించి అత్తామామల ఇంట్లో ఉన్న వెంకాయమ్మతో వివాదానికి దిగాడు. అడ్డొచ్చిన అత్తామామలు చలంచర్ల జయమ్మ(59), కల్లయ్యలు(64)లపై విచక్షణారహితంగా దాడి చేయడంతో వారు అక్కడికక్కడే మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.

● మద్యం మత్తులో అంతమొందించి

ఆదివారం వెంకాయమ్మ కాలనీవాసులతో కలిసి వింజమూరు మండలం గుండెమడగల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లింది. పని ముగించుకుని సాయంత్రం ఇంటికొచ్చిన భార్యతో రోజులాగే వెంగయ్య కోపోద్రిక్తుడై వివాదానికి దిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దుత్తలూరు సెంటర్‌కు వెళ్లిన అతను పూటుగా మద్యం సేవించి ఇంటికొచ్చాడు. ఇంట్లో వెంకాయమ్మ లేకపోవడంతో మచ్చుకత్తి తీసుకుని తన అత్తామామల ఇంటికెళ్లి వివాదానికి దిగాడు. అడ్డొచ్చిన అత్తమామలను దీనంతటికి మీరే కారణమని వారిపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. దీంతో వారు అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయారు. భార్యను సైతం కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. ఆమె కేకలు విన్న కాలనీవాసులు అక్కడికి చేరుకోవడంతో వెంగయ్య కత్తితో పరారయ్యాడు.

● దిక్కుతోచని స్థితిలో పిల్లలు

వెంకాయమ్మ పిల్లలు శ్రావ్య, మనోహర్, శ్రీవల్లి స్థానిక పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. తండ్రి చేసిన వీరంగంతో అక్కున చేర్చుకునే అవ్వాతాతలు దూరమయ్యారు. తల్లి తీవ్ర గాయాలపాలై వైద్యశాలలో ఉండటం, తండ్రి జైలుకెళ్లనుండటంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. బిక్కమొహం వేసుకుని ఉన్న ఆ పిల్లల్ని చూసి కాలనీవాసుల గుండె తరుక్కుపోయింది.



హత్యలు జరిగింది ఈ ఇంట్లోనే.. పక్కనే కల్లయ్య మృతదేహం

● నిందితుడి కోసం పోలీసుల గాలింపు

సమాచారం అందుకున్న వెంటనే ఉదయగిరి సీఐ వెంకటరావు, దుత్తలూరు, వరికుంటపాడు ఎస్ఐలు ఆదిలక్ష్మి, రఘునాథ్‌లు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. కాలనీ వాసుల నుంచి వివరాలు రాబట్టారు. రెవెన్యూ అధికారులతో కలిసి పంచనామా నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. మృతదేహాలను అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. నిందితుడి ఆచూకీ కోసం లుకవుట్ నోటీసులు సైతం జారీ చేశారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శివశంకర్

దక్కిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్‌ఐ శివశంకర్ అన్నారు. మండలంలోని తిమ్మాయపాళెం గ్రామంలో సోమవారం సివిల్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మత్తుపదార్థాల విక్రయం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అసాంఘిక శక్తులపై నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారితేనే ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోగలుగుతారని ఎంఈవో జగదీష్ బాబు అన్నారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల, వీఆర్వో కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న ఆటో: ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వెంకటగిరి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - రాపూరు జాతీయ రహదారిలో జింకలబంగ్లా వద్ద స్కూర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు... బాలాయపల్లి మండలం కయ్యూరు గ్రామానికి చెందిన కొండలరావు, జయమ్మ దంపతుల కుమార్తె పవిత్ర డక్కిలి పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. ఇంటర్‌లో చేరేందుకు టీసీ, స్టడీ సర్టిఫికెట్ కోసం సోమవారం కొండలరావు, జయమ్మ, పవిత్ర స్కూటర్‌లో డక్కిలికి బయలుదేరారు. జింకలబంగ్లా వద్ద వెళ్తుండగా వెనుక వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటర్ అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కొండలరావు, పవిత్రకు తీవ్ర గాయాలు కాగా, జయమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంకటగిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కోట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ సాయిబాబా సమీపంలో ఉన్న పూరింట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిశాయి. ఇంట్లో నివాసం ఉంటున్న లక్ష్మీకాంతమ్మతో పాటు కుటుంబ సభ్యులు బయట పనులకు వెళ్లగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసులు సిబ్బందితో వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రి కాలి బూడిదైంది.

చదువుతోనే ఉన్నత స్థానాలకు



విద్యార్థినికి నోటుపుస్తకాలు అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉన్నత స్థానాలకు చేరుకుంటామని డీఆర్‌డబ్ల్యు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మెహర్ మణి అన్నారు. సోమవారం కళాశాలలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి వాటిని సాధించుకోవాలన్నారు. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థినులను ప్రోత్సహించేందుకు రోటరీక్లబ్ ముందుకు వచ్చి ఈ తరహా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, రోటరీక్లబ్ ప్రతినిధులు దశరధరామిరెడ్డి, మునిగిరీష్, శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



తహసీల్దార్ హరికృష్ణను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పెళ్లకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని తహసీల్దార్ సీహెచ్ హరికృష్ణ అన్నారు. కలెక్టరేట్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానిక కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వోలు సుధాకర్, వంశీకృష్ణ, రమణయ్య, మోబీనా, తేజ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట తహసీల్దారుగా గోపినాథరెడ్డి



సూళ్లూరుపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దార్‌గా పెళ్లూరు గోపినాథరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న నరసింహారావు బదిలీపై వెంకటగిరికి వెళ్లడంతో ఆయన స్థానంలో నాయుడుపేట సీఎస్ టీటీగా పనిచేస్తున్న గోపినాథరెడ్డి నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను ఈఆర్వోలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించండి

దొరవారిసత్రం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కృష్ణపురం వద్ద సర్వే నెంబరు 305లో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించాలని శ్రీహరికోట పునరావాసులు సోమవారం తహసీల్దారు శైలాకుమారికి వినతిపత్రం ఇచ్చారు. 1970లో 10 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటే స్థానికులు అడ్డుకొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు కేటాయించిన స్థలాలకు రక్షణ కల్పించాలని కోరారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

తడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్కంధ పంచమి సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. చిన్నమాంబట్టులో ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయం, బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం స్వామివార్లకు అభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వెంకటగిరి టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బంగారుపేట పీహెచ్‌సీ పరిధిలో సోమవారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో జూలై 1నుంచి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శివకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా బీపీ, షుగరు పరీక్షలతో పాటు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తామని చెప్పారు. 1వ తేదీన చింతగుంట, పాపమాంబాబపురం, 3న జంగాలపల్లి, పారవోలు, 4న పాళెంకోట, సోమసానిగుంటలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

అదృశ్యమైన యువకుడి అప్పగింత

కోట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని జయరామ్ నగర్‌కు చెందిన ముఖేష్ అనే యువకుడు అదృశ్యం అయిన సంగతి తెలిసిందే. అతడు ముంబాయిలో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు సోమవారం కోటకు తీసుకువచ్చి ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ.. అభివృద్ధికి బాటలు

చిగురుపాడు రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే విజయశ్రీ



చిగురుపాడు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల, విజయభాస్కర్‌రెడ్డి

నాయుడుపేట టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులున్నా వాటిని అధిగమిస్తూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మండలంలో రూ.1.96 కోట్లతో నిర్మించిన చిగురుపాడు రోడ్డును సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదిలోనే తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం పూర్తి చేసినందుకు చిగురుపాడు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే విజయశ్రీని గుర్రం మీద ఊరేగిస్తూ గ్రామంలోకి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏ గ్రామమూ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోట్లాది రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ఎన్నికల సమయంలో చిగురుపాడుకు వచ్చిన తనకు గ్రామస్థులు రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని చెప్పడంతో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చామని, ఆ మేరకు మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా నగదు జమచేయడం జరిగిందన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ రమణ, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, గూడూరు ప్రభావతమ్మ, నెలవల రాజేష్, రఫీ, కట్టా రమణారెడ్డి, చెంచయ్య, పొట్లపూడి రాజేష్, నానాబాల సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, పల్లెటి రమణయ్య, నారాయణ, రవి, పాలేటి సుబ్రహ్మణ్యం, మణి, నరేంద్ర, శీను, గురవయ్య, గాలి రాజేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: మాజీ మంత్రి పరసా



సమావేశంలో మాట్లాడుతున్న పరసారత్నం, పక్కనే బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఆల్‌మెన్ రాజు, యాదగిరి, నాగరాజు గౌడ్ తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే ప్రత్యేక చొరవ తీసుకుంటామని ఏపీఎఫ్ వ్యవస్థాపకుడు మాజీ మంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల ప్రజలను ఒకే గొడుగుకిందకు తెచ్చేందుకు అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ స్థాపించామన్నారు. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాధికారం నినాదంతో బలహీన వర్గాలందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లామన్నారు. తొలిసారిగా ఈనెల 6న తిరుపతిలోని ఇందిరా మైదానంలో జరిగే జిల్లా స్థాయి బీసీ ఆత్మగౌరవ భరోసా సభకు అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ నాయకుడు కె.ఆల్‌మెన్ రాజు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్, కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, యాదగిరి, వాసుకుమార్ గౌడ్, స్థానిక నాయకులు కొక్కు శంకరయ్య, సుబ్రహ్మణ్యం, సుధాకర్ రెడ్డి, తిరుపాల్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి



సమావేశంలో ఏఐకేఎంఎస్ నాయకులు

గూడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ మాఫియా చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని వాటిని పేదలకు పంచాలని అఖిలభారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జాతీయ కార్యదర్శి భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో అఖిలభారత రైతుకూలీ సంఘం ఉమ్మడినెల్లూరు జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మిగులు భూములను మైనింగ్ నిర్వాహకులు ఆక్రమించుకున్నారన్నారు. ఈ భూములలో సాగుచేసుకునేందుకు పేదలు దిగితే వారిపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. పేదలపై పెట్టిన అక్రమకేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. కేంద్రప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుంటుందన్నారు. సైదాపురం మండలంలోని ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య, కృష్ణయ్య, రమేష్, మమత, నవకోటి, చెంగల్‌రావు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభను పెంపొందించుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శివప్రసాద్

గూడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమలోని ప్రతిభను పెంపొందించుకుని రాణించాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్ట్స్ విభాగంలో ఇటీవల షార్ట్‌టర్మ్ ఇంటర్నషిప్ పూర్తిచేస్తున్న బీఏ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైన్‌ఆర్ట్స్‌లోని ఇంటర్నషిప్ చేయడం ద్వారా చిత్రలేఖనంలో మెలుకువలను తెలుసుకుని విద్యార్థులు ప్రతిభను పెంపొందించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సురేంద్ర, డాక్టర్ పీర్ కుమార్, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, కిరణ్మయి, శైలజ పాల్గొన్నారు.

స్టాంపుల కొరత లేకుండా చర్యలు

గూడూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో స్టాంపుల కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ పసుపులేటి గిరిబాబు తెలిపారు. సోమవారం గూడూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన నిషేధిత భూముల జాబితా, ఈ-స్టాంపింగ్‌ల లావాదేవీలు, స్టాంపువెండర్ల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌రిస్ట్రార్లు నందకిషోర్, శ్రీనివాసులు, సిబ్బంది పవన్, గోకుల తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మైక్ భాషాను పరామర్శిస్తున్న సర్వజ్ఞ కుమార యాచేంద్ర

వెంకటగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణం పీర్లాతిపేటకు చెందిన మైక్ భాషా కుమారుడు పఠాన్ నూర్ షార్జాన్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ సర్వజ్ఞ కుమార యాచేంద్ర సోమవారం మైక్ భాషా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట 22వ వార్డు కౌన్సిలర్ గుమ్మళ్ళ డిల్లీబాబు, 4వ వార్డు కౌన్సిలర్ నారాయణ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశికుమార్ అన్నారు. సోమవారం స్థానిక సనత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో విద్యాసామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూర్య, యశ్వంత్, భాను, గణేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సమావేశం

గూడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు కండ్రిగ గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు సిసింద్రి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేసేందుకు సమావేశం నిర్వహించి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 7వ తేదీన ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని చెప్పారు.

తడి, పొడిచెత్త వేరు చేయడంపై అవగాహన

వెంకటగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండల పరిధిలోని పెట్లూరు, పంజామ్, మొగళ్ళగుంట, కలపాడు, అమ్మపాళెం గ్రామాల్లో సోమవారం ఎంపీడీవో గుణశేఖర్ పర్యటించారు. తడి, పొడిచెత్త వేరు చేయడంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందించండి

పెళ్లకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గతేడాది రబీలో సంభవించిన తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి పాదర్తి రాజారెడ్డి డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే మార్కెట్‌లో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నట్లు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పుస్తకాల పంపిణీ

వెంకటగిరి టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ దిల్‌రుబా వాయిద్య చివరి కళాకారుడు, సంగీతజ్ఞాని, విద్యావేత్త శ్రీహరిదాసు శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మనబడి మనమిత్రులు సభ్యులు సోమవారం ఆర్వీఎం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సుబ్బారావు, మురళి, నర్రారవి, రాజారామ్(చిట్టి), రవికుమార్, శ్రీనివాసరావు, బాలాజీ పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



బాధితులకు నిత్యవసరాలు అందజేస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

బాలాయపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలగంధ పంచాయతీ పరిధిలో గల కోనంగుంట గిరిజన కాలనీకి చెందిన మేకల అంకయ్య పూరిల్లు ప్రమాదశాత్తు ఇటీవల దగ్ధమైంది. గూడు కోల్పోయి నిరాశ్రయులైన అంకయ్య కుటుంబానికి సోమవారం తహసీల్దార్ విజయలక్ష్మి నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వో మేకలయ్య పాల్గొన్నారు.

నల్లమందు తిని గేదెకు గాయాలు

బాలాయలిపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్రమణ్యం గ్రామస్థుడు వెంకటయ్యకు చెందిన గేదె నల్లమందు తిని తీవ్ర గాయాలపాలైంది. పొలాల్లో అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు కొందరు నల్లమందు పెట్టారు. సోమవారం మేతకు వెళ్లిన గేదె నల్లమందు తినడంతో అది పేలి తీవ్రంగా గాయపడింది. అలాగే రెండు రోజుల క్రితం బాలాయపల్లి వాసి నాగయ్యకు చెందిన ఆవు నల్లమందు తిని చనిపోయినట్లు స్థానికులు తెలిపారు.

మాజీ మంత్రి పరసారత్నంను గవర్నర్‌గా నియమించాలి

నాయుడుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత డాక్టర్ పరసారత్నంను గవర్నర్‌గా నియమించాలని ఏపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఆల్‌మెన్‌రాజు అన్నారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆల్‌మెన్‌రాజు మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసించి టీడీపీ కోసం అహర్నిశలు పాటుపడిన పరసాను గవర్నర్ పదవికి సిఫార్సు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, జేవీకేఎస్ జాతీయ అధ్యక్షుడు యాదగిరి, తిరుపతి బీసీ సంఘం అధ్యక్షుడు జగదీష్, ఏపీఎఫ్ జిల్లా కన్వీనర్ రఘునాథ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలోని గుమ్మిడిపూడి - కవరపేట రైల్వే స్టేషన్‌ల ఇంజనీరింగ్, సిగ్నల్ వ్యవస్థ మార్పులు పనులు జరుగుతున్న క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5.20వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దు అయిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 8.10 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66035
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66036
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5.40, 10.15, మధ్యాహ్నం 12.10 వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.35, 1.15, 3.10 వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 10.30, 11.35, మధ్యాహ్నం 12.40, 1.40, 2.40 ఈఎంయూ లోకల్ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు మధ్యాహ్నం 1.00, 2.30, 3.15, 3.45, 4.30 బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు రద్దు అయ్యాయి.

వీటితో పాటు చెంగల్‌పట్టు, గుమ్మిడిపూడి, తాంబ్రం మధ్య నడిచే ఈఎంయూ లోకల్ రైళ్లు పాక్షికంగా రద్దు కాగా... చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ ఆవడి మధ్య నడిచే పలు ఈఎంయు లోకల్ రైళ్లు రద్దు చేసినట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు తెలిపారు.

కోట మండల టీడీపీ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి



ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు శివకోటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

కోట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోట మండల టీడీపీ అధ్యక్షుడిగా కొక్కుపాడు గ్రామానికి చెందిన పలగాటి భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు ఈశ్వరవాక శివకోటేశ్వరరెడ్డి అధికారికంగా భాస్కర్‌రెడ్డి పేరును ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న భాస్కర్‌రెడ్డి పలు కీలక బాధ్యతలు నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలకు సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

గూడూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



ఎంఈవో, తహసీల్దార్, పీఆర్ ఏఈలను సన్మానిస్తున్న అధికారులు

వెంకటగిరి టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాంబాబు, పీఆర్ ఏఈ కమలావిష్ణు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని అధికారులు ఘనంగా సన్మానించారు.

కోట: మండల పరిధిలోని చిట్టేడు ఎన్‌సీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు విజయలక్ష్మికి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆమెను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసులు షీల్డ్‌లు, మెమెంటోలతో సత్కరించారు. అలాగే జరుగుమల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పద్మావతి ఉద్యోగ విరమణ చేయడంతో ఎంఈవో మస్తానయ్య, ఉపాధ్యాయ సంఘాల నేతలు సత్కరించారు.

సూళ్లూరుపేట: మండలంలోని మంగళంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులురెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండలంలోని శ్రీధనమల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఖాదర్ మస్తాన్‌ను అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవోలు సురేష్ బాబు, రమణయ్య, ఎంపీడీవోలు గోవర్ధన్, మురళి, శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు నాయుడు, పామంజి శ్రీనివాసులు, మందాటి పురుషోత్తం, సర్పంచ్‌లు మురళిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం వీఆర్వో విన్నమాల పోలయ్య సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను తహసీల్దారు రామయ్య, డిప్యూటీ తహసీల్దారు సందీప్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్ఐ అఖిల్‌యాదవ్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు సన్మానించారు.